
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
గురువారం 12 సెప్టెంబరు 2024





● కనగాల వద్ద దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

నష్టపోయాం.. న్యాయం చేయండి



ఫొటో ప్రదర్శనను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులకు నష్టం వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు, కలెక్టర్ వెంకటమురళి

నేడు గుంటూరు జిల్లాలో..

గుంటూరు(ఆంధ్రజ్యోతి): కేంద్ర అంతర్ మంత్రిత్వ బృందం గురువారం వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించనున్నది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ వాగ్మరే(నాగ్‌పూర్), ఆర్థిక శాఖ కన్‌సల్‌టెంట్ కౌల్(ఢిల్లీ), గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రెటరి ప్రదీప్‌కుమార్(ఢిల్లీ)లో కూడిన త్రిసభ్య బృందం వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించనుంది. ఉదయం 9 గంటలకు కలెక్టర్ నాగలక్ష్మీ కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో కేంద్ర బృందానికి ఫొటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నష్టాన్ని వివరిస్తారు. అనంతరం పెదకాకాని పరిధిలోని గుంటూరు ఛానల్‌కు పడిన గండ్లను బృంద సభ్యులు పరిశీలిస్తారు. వెంకటకృష్ణాపురం, దేవరాయబొట్లపాలెంలో దెబ్బతిన్న పంటలు, మంగళగిరిలో దింపుడుకళ్లం చేనేతల ప్రాంతంలో నీటమునిగిన మగ్గాలను పరిశీలిస్తారు. తాడేపల్లి మండలం మహానాడులో, తుళ్లూరు మండలం వెంకటపాలెంలో వదర బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. కాగా గతంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కేంద్ర బృందాలు వెంటనే వచ్చేవి కాదు. నెల తర్వాత వచ్చి పరిశీలించేవి. అప్పుడు క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాన్ని అంతగా చూపెట్టలేకపోయేవారు. అయితే ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం మాత్రం కేవలం విపత్తు సంభవించిన 10 రోజుల్లోనే కేంద్ర బృందాన్ని పంపించింది. నేటికీ పెదకాకానితో పాటు అనేక మండలాల్లో పంట పొలాలు వరదనీటిలో మునిగే ఉన్నాయి. వాటిని చూపించడం ద్వారా వరద తీవ్రతని కేంద్ర బృందానికి నివేదిస్తామని అధికారవర్గాలు తెలిపాయి.



సమీక్షలో ఆయా శాఖల అధికారులను ప్రశ్నిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

వేమూరు, కొల్లూరు, రేపల్లె / బాపట్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరద ఊడ్చేసింది. ఒక్క రూపాయి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కట్టుబట్టలతో మిగిలాం. ఉద్యాన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీటమునిగాయి. అన్యాయమయ్యాము. ముంపుతో సర్వస్వం కోల్పోయాం. మీరే మమ్మల్ని ఆదుకోవాలి.. పూర్తిగా నష్టపోయాం.. న్యాయం చేయండి.. అంటూ కేంద్ర బృందానికి వరద బాధితులు గోడువెళ్లబోసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. భారీ వర్షాలు, వరదలతో జరిగిన నష్టాల పరిశీలనకు కేంద్ర బృందం బుధవారం జిల్లాలో పర్యటించింది. మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ విభాగానికి చెందిన డైరెక్టర్ వాఘ్‌మేర్, ఆర్థిక శాఖ కన్సల్టెంట్ కౌల్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌లతో కూడిన ముగ్గురు సభ్యుల కేంద్ర బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. షెడ్యూల్ ప్రకారం రావాల్సిన కేంద్ర బృందం రెండు గంటలు ఆలస్యంగా వేమూరుకు చేరుకుంది. వేమూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కలెక్టర్ వెంకటమురళి అధ్యక్షతన జిల్లా యంత్రాంగంతో కేంద్రబృందం సమీక్షించింది. వరదల వల్ల వివిధ విభాగాలకు జరిగిన నష్టాన్ని పీపీటీ ద్వారా కేంద్ర బృందానికి ఆయా శాఖల అధికారులు వివరించారు. వరద వల్ల జరిగిన నష్టాన్ని ప్రాంతాల వారీగా కేంద్ర బృందానికి కలెక్టర్ ప్రత్యేకంగా నివేదించారు. సమీక్ష అనంతరం బృందంలోని అధికారులు సుగ్గుల్లంక, పెసర్లంకలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. వాణిజ్య పంటలకు జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి రైతుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఓలేరు పల్లెపాలెం, రావి అనంతవరం కరకట్టలను పరిశీలించారు. పంటలకు వరదలు మిగిల్చిన నష్టాన్ని కేంద్ర బృందానికి రైతులు వివరించారు. సుగ్గుల్లంకలో వాణిజ్య పంటలకు జరిగిన నష్టంపై రైతులను వివరాలు అడగగా ఒక్క రూపాయి చేతికొచ్చే పరిస్థితి లేదని వాపోయారు. అరటితోటను చూపించి తోటంతా రంగుమారిపోయిందని మొత్తం నష్టపోయినట్లేనని రైతులు వివరించారు. పసుపు, గుమ్మడి రైతుల నుంచి కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. కనగాల దగ్గర ముంపులో ఉన్న వరి పొలాన్ని బృందం పరిశీలించింది. గత ఐదేళ్లలో కాల్వల మరమ్మతులు చేపట్టకపోవడమే ప్రస్తుత దుస్థితికి కారణమని రైతులు తెలిపారు. సమీపంలోనే జాతీయ రహదారి ఉండడం కూడా ముంపునకు కారణమని, కల్వర్టుల నిర్మాణంపై ఆలోచన చేయాలని కేంద్ర బృందానికి రైతులు నివేదించారు.

- కేంద్ర బృందానికి బాధితుల వినతులు
- వరద ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన
- పీపీటీ ద్వారా నష్టం అంచనాలను వివరించిన అధికారులు
- వాణిజ్య పంటలకు చేసిన ఖర్చు గురించి ఆరా తీసిన సభ్యులు
- డ్వాక్రా, పంట రుణాలు రద్దు చేయాలని కోరిన చింతల్లంక మహిళలు

కాన్వాయ్‌ను అడ్డుకున్న మహిళలు..

చింతల్లంక, పెదల్లంక గ్రామంలోని మహిళలు కేంద్ర బృందం కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని అధికారులను అభ్యర్థించారు. వరదలతో సర్వస్వం కోల్పోయామని డ్వాక్రా రుణాలతో పాటు పంట రుణాల విషయంలో తమకు కొంత వెసులుబాటు ఇవ్వాలని కేంద్ర బృందాన్ని కోరారు. బ్యాంకర్లతో మాట్లాడి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో మహిళలు కాన్వాయ్‌కు దారిచ్చారు. చింతల్లంకలో ఓ ఇంటిలోకి వెళ్లి దెబ్బతిన్న గోడలను పరిశీలించడంతో పాటు నష్టంపై యజమానులను అధికారులు ప్రశ్నించారు. పెసర్లంకలో ముంపుతో దెబ్బతిన్న ఓ ఇంటిని పరిశీలించి వివరాలను కేంద్ర బృందం నమోదు చేసుకుంది. చెరుకుపల్లి మండలం కనగాలలో పదిరోజులుగా నీటిలో నానుతున్న వరి పొలాలను చూసి కేంద్రబృందం ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. ఇన్ని వేల ఎకరాలు పంట నష్టపోవటం కనుచూపుమేర నీరు తప్ప పొలం కనిపించకపోవడంతో ఎంత నష్టం వాటిల్లిందని కలెక్టర్‌ను ప్రశ్నించింది. ఇన్నిరోజులుగా పొలాలు నీటిలో నానడం ఏమిటని, దీనిపై ఏమి చర్యలు తీసుకోలేదా డ్రెయినేజీ, ఇరిగేషన్ అధికారులు పనిచేస్తున్నారా అని ప్రశ్నించారు. ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టామని నాట్లు వేసి 20 రోజులు అవుతుందని 10 రోజులుగా నీటిలోనే నానుతున్నాయని, ఆదుకోకుంటే అప్పుల పాలవ్వుతామని రైతులు తెలిపారు.



చింతల్లంకలో డ్వాక్రా, పంట రుణాలను రద్దు చేయాలని కలెక్టర్, కేంద్ర బృందం సభ్యులను అడుగుతున్న మహిళలు

కరకట్ట పరిశీలన..

భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెంతో పాటు రేపల్లె మండలం రావి అనంతవరం కరకట్టలను, అరవింద వారధిని కేంద్ర బృందం పరిశీలించింది. కరకట్టకు వచ్చిన వరద ఉధృతి పరిస్థితులను ఫొటోలతో కేంద్రబృందానికి కృష్ణారివర్ అధికారులు వివరించారు. వాటి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీసింది. వరదలు ఉధృతంగా ఉన్న సమయంలో బలహీనంగా ఉన్న కరకట్టల వల్ల బిక్కుబిక్కుమంటూ ఎలా కాలం వెళ్లదీశామో ప్రభావిత ప్రాంతాల ప్రజలు బృందసభ్యులకు వివరించారు. వరదలు వచ్చినప్పుడల్లా తీరప్రాంతంలో కోట్లాదిరూపాయలు నష్టం వాటిల్లుతుందంటూ తెలిపారు. కరకట్టల పటిష్ఠతకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ వివరించగా వారు నివేదికలో పొందుపరుచుకున్నారు. కరకట్టను బలపరిచే విధంగా తగినన్ని నిధులు మంజూరు చేయిస్తే తీరప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని వెంకటమురళి చెప్పారు. నీటమునిగిన రావిఅనంతవరం గ్రామాన్ని కూడా కేంద్ర బృందంలోని అధికారులు పరిశీలించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంకటమురళితో పాటు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌లతో ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రూ.వెయ్యి కోట్ల నష్టం

విభాగాల వారీగా వివరాలు ఇచ్చిన అధికారులు

వరదల ధాటికి జిల్లాలో జరిగిన నష్టానికి సంబంధించి విభాగాల వారీగా అంచనాలను అధికారులు కేంద్ర బృందానికి సమర్పించారు. దీనిలో భాగంగా వ్యవసాయ, ఉద్యాన పంటలకు రూ.583 కోట్ల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు. 32,771 మంది రైతులకు సంబంధించి 86,659 ఎకరాలు దెబ్బతినగా, 8,468 మంది రైతులకు చెందిన 11,537 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. గృహాలకు సంబంధించి 7,943 నీట మునిగాయని వీటికి వాటిల్లిన నష్టం రూ.9.52 కోట్లుగా అంచనా వేశారు. 202 కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ రహదారులు దెబ్బతినగా 96.23 కోట్ల నష్టం వాటిల్లిగా, 191 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు ఛిద్రమయ్యాయని శాశ్వత నిర్మాణం కోసం రూ.382.54 కోట్లు ఖర్చు కాగలదని నివేదికలో పొందుపర్చారు. విద్యుత్ శాఖకు రూ.1.17 కోట్లు, ఆక్వా రంగానికి రూ.10.17 కోట్లు, పాఠశాల భవనాలకు రూ.3.83 కోట్లు నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి అందించిన నివేదికలో పేర్కొన్నారు. వరదల ధాటికి 24 లంకగ్రామాల్లోని 30,000 మంది ప్రజలు బాధితులుగా మారారని చెప్పారు.



చెరుకుపల్లి : కనగాల సమీపంలో మునిగిన వరి పొలాల మ్యాప్‌ను కేంద్ర బృందంకు వివరిస్తున్న కలెక్టర్

లైసెన్సు లేకుండానే.. వ్యాపారాలు

- మిర్చియార్డులో అక్రమాలను గుర్తించిన విజిలెన్స్
- ప్రత్యక్ష విచారణలో వ్యాపారులు, వేమన్ల వాంగ్మూలాల నమోదు
- అక్రమాలను నేటి డీజీ సమావేశంలో నివేదించే అవకాశం



యార్డులో స్పాట్ ఎంక్వయిరీ నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

గుంటూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): లైసెన్సులు లేకుండానే వ్యాపారం.. శాంపిల్ టిక్కీలకు రూ.10 చొప్పున అనధికారికంగా వసూళ్లు.. ఒక్కో ప్లాట్‌ఫాంపై రెండు బోర్డులు.. ఇలా గుంటూరు మిర్చియార్డులో అనేక అక్రమాలను విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఇప్పటికే వేల సంఖ్యలో ఫైళ్లను తీసుకెళ్లిన అధికారులు బుధవారం ఉదయం 6 గంటలకే యార్డుకు చేరుకుని దిగుమతి వ్యాపారులు, వేమన్లు, సూపర్‌వైజర్లను ప్రత్యక్షంగా విచారించారు. ఈ విచారణలో భాగంగా అనేక అక్రమాలను గుర్తించినట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో మిర్చియార్డులో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ బృందం స్పాట్ ఎంక్వయిరీ నిర్వహించింది. టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, మిర్చియార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు గత నెలలో విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌కు చేసిన ఫిర్యాదు ఆధారంగా స్థానిక అధికారులు విచారణ చేపట్టారు. ఇప్పటికే యార్డు అధికారులతో మాట్లాడి అవసరమైన ఫైళ్లను కలెక్టరేట్ ప్రాంగణంలోని విజిలెన్స్ కార్యాలయానికి తీసుకెళ్లి పరిశీలిస్తున్నారు. తాజాగా బుధవారం విజిలెన్స్ సీఐ ఏ శ్రీహరిరావు, తహసీల్దారు కే నాగమల్లేశ్వరరావులతో కూడిన బృందం యార్డుకు చేరుకుని విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కొన్నేళ్లుగా రైతులు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకుని అన్‌సీజన్‌లో విక్రయానికి తీసుకొస్తున్న శాంపిల్ టిక్కీలకు రూ.10 చొప్పున అనధికారికంగా వసూలు చేస్తున్నారని గుర్తించారు. రూ.లక్షల్లో అక్రమంగా వసూలు చేశారని నిర్ధారించుకున్నారు. మరోవైపు ఒక్కో కమిషన్ వ్యాపారికి కేటాయించే ప్లాట్‌ఫాంకు రెండు, మూడు ఫరంల బోర్డులుండటాన్ని గమనించారు. దీనిపై ఆరా తీయగా కొంతమంది లైసెన్సు కలిగిన కమీషన్ ఏజంట్లు వ్యాపారం చేయకుండా లీజుకు ఇచ్చి ఏటా రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారని తేలింది. అక్కడే ఉన్న వేమన్లను కూడా విచారించారు. కాటా వేస్తున్న చోట బిడ్డింగ్ బిల్లు, వేమెన్ చీటి పరిశీలించగా షాపు పేరుకు, చీటీలో నమోదు చేసిన పేరుకు పొంతన లేదు. లైసెన్సులు లేకుండా సుమారు 60 మంది వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు.

లైసెన్సుల రెన్యువల్‌లో అక్రమాల గుర్తింపు

2022లో ప్రభుత్వం జీవో 85ని తీసుకొచ్చి ఒక్కో కమీషన్ వ్యాపారి వద్ద రూ.5 లక్షల డిపాజిట్ చెల్లించుకుని లైసెన్సులు రెన్యువల్ చేయాల్సిందిగా ఆదేశించింది. అయితే ఏ కొద్దిమందో డిపాజిట్‌లు చెల్లించారు తప్ప మిగతా వారంతా హైకోర్టులో స్టే తెచ్చుకున్నారు. వీరందరి లైసెన్సులు రెన్యువల్ చేయడానికి రూ.50 వేల చొప్పున వసూలు చేసినట్లు కొంతమంది విజిలెన్స్ అధికారులకు ఉప్పందించారు. మరోవైపు మార్కెటింగ్ కమిషనర్ 64 ఫరంలకు సంబంధించి పార్టనర్‌షిప్ మార్పులను అనుమతించగా దానిని అడ్డం పెట్టుకుని అప్పటి పాలకులు 184 పార్టనర్‌షిప్‌లను మార్పు చేసేసి ఒక్కొక్కరి వద్ద రూ.లక్షల్లో అనధికారికంగా వసూలు చేసి వెనకేసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు కొన్ని ఆధారాలను సేకరించారు. అలానే ఈ ఏడాది ఫిబ్రవరిలో మిర్చి యార్డులో గేట్ ఎంట్రీ అయిన సరుకుకు, కాటాలు జరిగిన టిక్కీలకు పొంతన లేకుండా ఉన్నట్లు తేలింది. దాదాపుగా 50 శాతం టిక్కీలు గల్లంతయ్యాయి. దీనిని బట్టి జీరో బిజినెస్ పెద్దఎత్తున జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఎంత సరుకు అయితే జీరోలో వెళ్లిందో దాని రూపంలో మార్కెటింగ్‌కు 1 శాతం మార్కెట్ ఫీజు, వాణిజ్య పన్నుల శాఖకు 5 శాతం జీఎస్‌టీ నష్టం వాటిల్లింది. దీనంతటిపై సమగ్ర నివేదికని ప్రభుత్వానికి అందజేసేందుకు విజిలెన్స్ అధికారులు ఫైలు సిద్ధం చేస్తున్నారు. గురువారం విజిలెన్స్ డీజీ హరీష్ కుమార్ గుప్తా నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సమావేశంలో మిర్చియార్డు విచారణను కూడా నివేదించే అవకాశం ఉన్నది.



వివరాలు సేకరిస్తున్న నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

అయ్యో.. అరటి

- వరదలతో దెబ్బతిన్న తోటలు
- చెట్లపైనే పండి పోతున్న గెలలు
- రూ.1300 నుంచి రూ.600కు పడిపోయిన ధర



మార్కెట్ రూ.600 పలికిన అరటి గెలలు

కొల్లిపర, సెప్టెంబరు 11: ఉమ్మడి గుంటూరు జిల్లాలో అతి పెద్ద అరటి మార్కెట్‌గా ప్రసిద్ధి చెందిన కొల్లిపర మార్కెట్‌లో ప్రస్తుతం అరటి గెలలు ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. నిన్న మొన్నటి వరకు ఎన్నడూ లేనివిధంగా అరటి గెలల ధరలు పలకటంతో రైతులు ఆశ్చర్య పోయారు. సామాన్య ప్రజలు కూడా అరటి కాయలను కొనుగోలు చేయాలంటేనే భయపడిపోయారు. అటువంటిది అరటి ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో రైతులు నిరుత్సాహపడుతున్నారు. వరదలు, వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండటంతో తోటల్లోనే అరటి గెలలు పండిపోతున్నాయి. దీనికితోడు కృష్ణానది వరదకు లంకల్లో వేసిన అరటి తోటలు నీటిలో మునిగిపోయి బురద కొట్టుకుపోయాయి. దీంతో రుతువుకు రాకుండానే పండిపోతున్నాయి. రైతులకు అపారమైన నష్టం వాటిల్లుతుంది. పండిపోతుండటంతో గెలలు నరికి మార్కెట్‌కు తరలిస్తున్నారు. పడిన గెలలు మార్కెట్‌కు రావడంతో వ్యాపారులు వారికి ఇష్టం వచ్చినట్లు కొనుగోలు చేస్తున్నారు. అరటి పంట లేని సమయంలో ఆకాశాన్ని అంటిన ధరలు పంట వచ్చే సమయంలో పడిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

పది రోజుల క్రితం వరకు..

పది రోజుల క్రితం మొదటి రకం కర్పూర అరటి గెల ధర రూ.1000 నుంచి రూ.1350 వరకు, రెండో రకం రూ.700 నుంచి రూ.800 పలికాయి. మూడో రకం కర్పూర గెల రూ.350 నుంచి రూ.400, చక్కెర కేళి మొదటి రకం రూ.350 నుంచి రూ.450 వరకు ధర పలికింది. ఈ ధరలను చూసి రైతులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. అటువంటిది ప్రస్తుతం మొదటి రకం అరటి గెల ధర రూ.600 నుంచి రూ.500, రెండో రకం రూ.400 నుంచి రూ.300 వరకు పలుకుతుంది. చక్కెరకేళి రకం రూ.200 నుంచి రూ.250 వరకు ధర పలుకుతుంది. రూ.800 నుంచి రూ.500 వరకు ధర తగ్గడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మహానంది, రావుపాలెం, ఏలూరు నుంచి ఎక్కువగా అరటి గెలలు దిగుమతి అయ్యే అవకాశం ఉందని, దీంతో ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు తెలిపారు.



కొల్లిపర మార్కెట్‌లో గెలలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

డజను రూ.60 నుంచి రూ.80 విక్రయం

మార్కెట్‌లో అరటి గెలకు ధర తక్కువగా ఉన్నా వ్యాపారులు మాత్రం అధిక ధరకు అమ్ముతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరను బట్టి డజను అరటి కాయలు రూ.20 నుంచి రూ.35 మాత్రమే పడుతున్నాయి. అటువంటిది వ్యాపారులు మాత్రం డజను అరటి కాయలను రూ.60 నుంచి రూ.80 వరకు అమ్మిసొమ్ము చేసుకుంటున్నారు. దీంతో అరటి కాయలను కొనాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. పండించిన రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు.

ఇసుక బుకింగ్స్ నిల్



- తెరుచుకోని ఏపీ శాండ్ పోర్టల్
- పలు మార్లు శోధించినా నాట్ ఫౌండ్ సందేశం

గుంటూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక నూతన విధానంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం బుధవారం నుంచి ప్రారంభిస్తామని చెప్పిన ఏపీ శాండ్‌పోర్టల్ బుకింగ్స్‌కు తెరుచుకోలేదు. ఉదయం నుంచి రాత్రి వరకు వందల మంది 'మైన్స్‌ఏపీ.జీవోవీ.ఇన్/శాండ్/' వెబ్‌సైట్‌ని తెరి చేందుకు ప్రయత్నించగా అన్నిసార్లు కూడా పేజ్ నాట్ ఫౌండ్ మెసేజ్ వచ్చింది. దీంతో ఆన్‌లైన్ విధానాన్ని తీసుకురావడంలో సాంకేతిక సమస్యలున్నట్లు ప్రజలు భావిస్తున్నారు. ప్రస్తుతం వరదల కారణంగా నిర్మాణాలు కూడా నిలిచిపోయి ఉన్నందున పెద్దగా ఇసుక అవసరం లేకపోవడంతో ప్రజల నుంచి అంతగా ఒత్తిడి లేదు. లేకుంటే సమస్యలు తలెత్తి ఉండేవే.

రవాణా చార్జీలపై అభ్యంతరం..

నూతన పాలసీలో భాగంగా ఇసుక రవాణా చార్జీలు తగ్గించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇందుకోసం రవాణా చార్జీలను దూరం, వాహనం కేటగిరీని బట్టి ప్రతిపాదించింది. దాని ప్రకారం సున్నా నుంచి ప్రతీ 10 కిలోమీటర్లకు ఒక ఛార్జీని ప్రతిపాదించింది. 10 కిలోమీటర్ల లోపు అయితే ట్రాక్టర్‌కు రూ.547, ఆరు టైర్ల లారీకి రూ.972, 10 టైర్ల లారీకి రూ.1,532ని ప్రతిపాదించింది. ఎక్కువ ఇసుక స్టాక్‌యార్డులు 41 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున వాటి నుంచి ట్రాక్టర్‌కు రూ.2,456, ఆరు టైర్లకు రూ.4,485, 10 టైర్ల లారీకి రూ.7,198 ప్రతిపాదన చేసింది. 81 నుంచి 90 కిలోమీటర్ల దూరం అయితే ట్రాక్టర్‌కు రూ.3,528, ఆరు టైర్ల లారీకి రూ.6,868, 10 టైర్ల లారీకి రూ.11,487గా ప్రతిపాదించింది. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న చార్జీల వల్ల తమకు నష్టం వాటిల్లుతుందని గుంటూరు కలెక్టరేట్‌లో రెండు రోజుల క్రితం జరిగిన సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మికి లారీ, ట్రాక్టర్ యజమానులు చెప్పారు. ప్రతీ కిలోమీటర్‌కు రూ.200 చార్జీ నిర్ణయిస్తేనే గిట్టుబాటు అవుతుందని చెప్పారు. ఇదే విషయాన్ని కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై ఇంకా ప్రభుత్వం నిర్ణయాన్ని వెలువరించలేదు.

నిక్షిప్తమైతే.. నిజాలు తెలుస్తాయేమో!

- పీఏసీఎస్ కంప్యూటరీకరణపై అక్రమార్కుల గుండెల్లో గుబులు

ఇండియా - ఏ క్రికెట్ జట్టులో గుంటూరు యువకుడు

- రషీద్ ఎంపికపై పలువురు హర్షం



6లో..

జాతీయ ప్రదర్శనకు ఎంపిక

పెదకాకాని, సెప్టెంబరు 11: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫైన్ ఆర్ట్స్ విభాగంలో చివరి సంవత్సరం విద్యార్థి సోను దాస్ క్యామెల్ కంపెనీ నిర్వహిస్తున్న జాతీయ క్యాంప్, చిత్ర ప్రదర్శనలో పాల్గొనేందుకు ఎంపికయ్యాడు. కర్ణాటక, హంపిలో నవంబర్ 25 నుంచి 29 వరకూ ఈ క్యాంప్ ఐదు రోజులపాటు జరగనుంది. ఈ క్యాంప్‌లో ఎంపికైన వర్ణచిత్రాలు వచ్చే ఏడాది జనవరిలో ముంబాయి జహంగిర్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శిస్తారు. నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య గంగాధరరావు విద్యార్థిని అభినందించారు. ఫైన్ ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి.శేఖర్ బాబు, అధ్యాపకులు పి.దేవకాంత్ పాల్గొన్నారు.

వినాయక విగ్రహానికి పూజలు

పెదకాకాని, సెప్టెంబరు 11: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో భాగంగా బుధవారం ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు వినాయక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ కుటుంబానికి క్షేమం జరగాలని, అభివృద్ధి మరింత రెట్టింపు అవ్వాలని, అందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఆచార్య ఎల్.జయశ్రీ, డాక్టర్ ఎం.వి.రమణ, డాక్టర్ శ్రీకృష్ణ, విద్యార్థి సంఘాల నాయకులు అభిషేక్, హేమంత్ పాల్గొన్నారు.

జోగులాంబ హాల్ట్‌లో రైళ్ల నిలుపుదల ఎత్తివేత

గుంటూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్లాట్‌ఫాం పనుల కారణంగా వారంపాటు శ్రీబాల బ్రహ్మేశ్వర జోగులాంబ రైల్వేస్టేషన్‌లో రైళ్ల నిలుపుదల ఎత్తి వేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు నంబరు. 17252 కాచీగూడ - గుంటూరు, 17251 గుంటూరు - కాచీగూడ, 17254 ఔరంగబాద్ - గుంటూరు, 17253 గుంటూరు - ఔరంగబాద్ రైళ్లకు నిలుపుదల ఎత్తి వేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

నందిగం సురేష్ పోలీస్ కస్టడీపై ముగిసిన విచారణ

మంగళగిరి, సెప్టెంబరు 11: వైసీపీ నాయకుడు, బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పోలీసు కస్టడీకి ఇవ్వాలని మంగళగిరి రూరల్ పోలీసులు వేసిన పిటీషన్‌పై మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం వాదనలు జరిగాయి. వాదనలు పూర్తి కాగా ఈ నెల 13న తీర్పు వెలువరిస్తామని న్యాయమూర్తి సురేష్‌బాబు చెప్పారు. ఇదిలా ఉండగా టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను ఈ నెల 5న మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. కాగా సురేష్ విచారణకు సహకరించకపోవడంతో పోలీసు కస్టడీకి 8 రోజులు ఇవ్వాలని రూరల్ పోలీసులు కోర్టును ఆశ్రయించారు.

ద్విచక్ర వాహనం పైనుంచి జారి మహిళ మృతి

నాదెండ్ల, సెప్టెంబరు 11: ద్విచక్ర వాహనం పైనుంచి జారి పడగా బొక్కా కుమారి(33) అనే మహిళ బుధవారం మృతి చెందింది. కారంపూడి మండలం పేటసన్నిగండ్ల గ్రామానికి చెందిన బొక్కా ఇస్సాక్, కుమారి దంపతులు కొద్దికాలం నుంచి గుంటూరులో ఉంటూ కూలి పనులు చేసుకొని జీవిస్తున్నారు. కుమారి మామకు ఆరోగ్యం బాగా లేకపోవటంతో ఆయన నరసరావుపేటలోని ఒక వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఆయన్ను చూసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చి గుంటూరు వెళ్తుండగా సాతులూరు గ్రామ పరిధిలోని స్పీడు బ్రేకర్ వద్ద వెనుక కూర్చున్న కుమారి జారి కింద పడింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయం కావటంతో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరాడంబరంగా విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవ

పెదకాకాని, సెప్టెంబరు 11: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం నిరాడంబరంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ 1976లో అప్పటి రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం దినదినాభివృద్ధి చెందుతూ నేడు కొన్ని లక్షల మందికి డిగ్రీలను, కొన్ని వేల మందికి డాక్టరేట్ పట్టాలను అందించి రాష్ట్రస్థాయితోపాటు జాతీయంగానూ తన ఉనికిని చాటుకుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు వారి వారి శక్తి మేర కృషిచేసి విశ్వవిద్యాలయ ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నందుకు అందరినీ అభినందించారు. విశ్వవిద్యాలయ పురోగతి నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంలో ఆచార్య నాగార్జున విగ్రహానికి పూలమాలలు వేశారు. ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కె.రత్న షీలామణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపారాణి, ఆచార్య కె.వీరయ్య, ఆచార్య ప్రమీలరాణి పాల్గొన్నారు.

నిక్షిప్తమైతే.. నిజాలు తెలుస్తాయేమో!



- పీఏసీఎస్ కంప్యూటరీకరణపై అక్రమార్కుల గుండెల్లో గుబులు
- బోగస్, బినామీ రుణాలు వెలుగులోకి వచ్చే అవకాశం

గుంటూరు సిటీ, సెప్టెంబరు 11: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) జరుగుతున్న అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. జిల్లా లోని సహకార సంఘాల రికార్డులన్నీ కంప్యూటరీకరణ చేయాలని ఆదేశించింది. అక్టోబర్ 2 నాటికి అన్ని సహకార సంఘాల్లోని రికార్డులన్నింటినీ కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయాలని గడువు విధించారు. జిల్లాలోని 63 సహకార సంఘాల్లో ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభం అయింది. ప్రభుత్వం విధించిన గడువులోగా కంప్యూటరీకరణ పూర్తి చేయించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ సహకార శాఖ అధికారులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే సహకార శాఖలోని కొందరు మాత్రం రికార్డుల కంప్యూటరీకరణ కు పెద్దగా ఆసక్తి చూపటం లేదు. ఇప్పటి వరకు జరిగిన లావాదేవీలు కంప్యూటర్లోకి ఎక్కితే బోగస్, బినామీ రుణాలు బయటకు వస్తాయన్న ఆలోచనతో చాలామంది ఉన్నట్లు తెలుస్తోంది.

ఉచ్చు బిగిసినట్లే..

వ్యవసాయ పరపతి సంఘాలను అడ్డుపెట్టుకుని చాలా మంది రాజకీయ నాయకులు, అధికారులు, సిబ్బంది అనేక అక్రమాలకు పాల్పడ్డారు. రైతుకు కనీస సమాచారం లేకుండానే వారి పేర్లతో రూ.కోట్లలో రుణాలు పొందారు. ప్రతి ఏడాది ఆ రుణాలను రీషెడ్యూల్ చేస్తున్నారే తప్పా పూర్తిగా చెల్లించటం లేదు. రికార్డుల్లో మాత్రం రుణం పూర్తిగా చెల్లించినట్లు, మళ్లీ కొత్త రుణం మంజూరు చేసినట్లు ఉంటుంది. ఇటువంటి విధానం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా కొనసాగుతూ వస్తుంది. ఇదిగాక కొన్ని వేలమంది ఆయా సహకార సంఘాల్లో సభ్యులుగా ఉంటే కొద్దిమందికి మాత్రమే రుణాలు ఇస్తున్నారు.

కేవలం 550 మందికి ఏటా పంట రుణాలు

ఉదాహరణకు ఫిరంగిపురం వ్యవసాయ పరపతి సంఘంలో 24 వేల మంది సభ్యులు ఉంటే అందులో కేవలం 550 మందికి ఏటా పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. ఇలా చాలా సంఘాల్లో ఇటువంటి వ్యవహారాలు జరుతున్నాయి. పార్టీ ఏదైనా సొసైటీ అధ్యక్షుడుగా వస్తున్న వ్యక్తులు ఎంతోకొంత అవినీతి, అక్రమాలకు పాల్పడి వ్యవసాయ పరపతి సంఘాలను దోచుకున్నట్లు శాఖ అంతర్గత ఆడిట్‌లో బహిర్గతం అవుతుంది. సహకార సంఘాల రికార్డులన్నీ చేవ్రాతతో ఉండటంతో ఇటువంటి అక్రమాలకు అవకాశం ఉంటుంది. దాన్ని నివారించేందుకు కూటమి ప్రభుత్వం సహకార సంఘాల కంప్యూటరీకరణను తెరపైకి తెచ్చింది. ఇది జరిగితే గత కొన్నేళ్లుగా సొసైటీల్లో జరిగిన అక్రమాలు వెలుగులోకి రావటంతోపాటు, భవిష్యత్‌లో అటువంటి వాటికి అవకాశం ఉండదని సహకార శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

అమరావతిపై దుష్ప్రచారం వద్దు

- వర్షం పడితే ఎక్కడైనా నీళ్లు వస్తాయి
- జగన్‌రెడ్డిని జైల్ టూరిజం అంబాసిడర్‌గా పెట్టాలి
- మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్



ఉద్దండ్రాయునిపాలెం లంక వాసులకు నిత్యవసర సరకులను అందిజేస్తున్న మాజీ మంత్రి, టీడీపీ నేత డొక్కా మాణిక్య వరప్రసాద్

తుళ్లూరు, సెప్టెంబరు 11: అమరావతి ముంపు అని వైసీపీ వారు ప్రచారం చేయవద్దని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, టీడీపీ నేత డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. బుధవారం తాళ్ళాయపాలెం, ఉద్దండ్రాయునిపాలెం లంకల్లో డొక్కా పర్యటించి వరద బాధితులను పరామర్శించి పులి సుధాకర్ మెమోరియల్ ద్వారా ఏర్పాటు చేసన నిత్యవసర సరలను 160 కుటుంబాలకు ఆయన అందజేశారు. తుళ్లూరు మండలంలో లంక ప్రాంతం నివాసులకు వరద వల్ల ప్రతి సారి నష్టం కలుగుతుందన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి లంక వాసులకు శాశ్వత గృహ కల్పన, భృతి ఏర్పాటు అయ్యేలా చేస్తామన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో డొక్కా మాట్లాడుతూ వర్షం పడితే ఎక్కడైనా నీళ్లు వస్తాయన్నారు. గుంటూరుకు వరద నీరు వచ్చిందన్నారు. విజయవాడ బుడమేరు వరద వస్తే 175 నియోజకవర్గాల్లో పోటి చేసిన వారంతా ఏమైపోయారో తెలియటం లేదన్నారు. జగన్‌రెడ్డి హింసను ప్రోత్సహిస్తున్నారన్నారు. అధికారం పోతే అంతు తేలుస్తానని అనటం ప్రజాస్వామ్యాన్ని కాలరాయటమేనన్నారు. ప్రజలకు జగన్‌రెడ్డి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నాడని ప్రశ్నించారు. మళ్లీ అధికారంలోకి వస్తే అక్రమ కేసులుపెడతానని జగన్‌రెడ్డి అనటం చూసి టెర్రరిస్టులు కూడా.. మేము అధికారంలోకి వస్తామంటారన్నారు. ఇలా మాట్లాడితే హింసను ప్రేరేపిస్తున్నారని వైసీపీని ఎన్నికల కమిషన్ రద్దు చేస్తుందన్నారు. హిస్టారికల్ , బుద్ధిస్ట్ టూరిజంలకు బ్రాడ్ అంబాసిడర్‌లను ఏర్పాటు చేసిన మాదిరిగా డార్క్ జైలు టూరిజం ఏర్పాటు చేసి దాని అంబాసిడర్‌గా జగన్‌రెడ్డిని పెట్టాలని కోరుకుంటున్నాని డొక్కా అన్నారు. బ్యారేజీని బోటులు గుద్దుకోవటం వెనక కుట్ర కోణం దాగి ఉంటే ఎంతటి వారైనా చట్టం వదిలిపెట్టదని హెచ్చరించారు.

వరద బాధితులకు రూ. 50 లక్షల విరాళం

- సంగం చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్ (చేబ్రోలు) సెప్టెంబరు11: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి సంగం డెయిరీ రూ.50 లక్షల విరాళాన్ని అందించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తెలిపారు. బుధవారం సంగం డెయిరీ పాలకవర్గ సమావేశం జరిగింది. పలు కీలక నిర్ణయాలను చర్చించిన అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో చైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది సంగం డెయిరీ రూ. 1877 కోట్ల టర్నోవర్ సాధించినట్లు చెప్పారు. పాల రైతులకు బోనస్ అందించిన తర్వాత రూ.12 కోట్ల లాభాలను సాధించినట్లు ప్రకటించారు. విజయవాడ నగరం ముంపునకు గురైన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సంగం డెయిరీ పాలు, మజ్జిగ పంపిణీ చేశామన్నారు. బాధితుల సహాయార్థం సంగం భాగస్వామి కావటం సంతోషంగా ఉందన్నారు. పాల ఉత్పత్తిదారులు వరద బాధితులుగా మారటంతో వారి పశువుల సంరక్షణ కోసం 70 మెట్రిక్ టన్నుల పశు దాణాను ఉచితంగా అందించామన్నారు. ప్రభుత్వం కూడా రాయితీపై తక్కువ ధరకు పశుదాణా కోరిందని సరఫరా చేసినట్లు చెప్పారు. కరోనా సమయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం తమను వేధింపులకు గురిచేసి కేసులు నమోదు చేసినప్పటికీ సామాజిక బాధ్యతగా సీఎం సహాయ నిధికి విరాళం అందించాం అన్నారు. అలాగే సంగం డెయిరీ చట్టపరంగా అనుసరించాల్సిన విధానాలపై సమీక్ష చేసినట్లు చెప్పారు. త్వరలోనే రాష్ట్రంలోని అనంతపురంతోపాటు, ఐదు చోట్ల బీఎంసీలు ఏర్పాటు చేయాలని పాలకవర్గం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. భవిష్యతుకు అనుగుణంగా సంగం డెయిరీని మరింత విస్తరణ ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో కూడా త్వరలోనే కార్యకలాపాలు జరగనున్నట్లు వివరించారు. ఎండీ పి.గోపాల కృష్ణన్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే నైతిక హక్కు లేదు



మాట్లాడుతున్న జనసేన నేతలు గాదె, బోనబోయిన

గుంటూరు, సెప్టెంబరు 11: వరద బాధితులకు ఒక్క రూపాయి కూడా సహాయం చేయని మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి, ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. బుధవారం లాడ్జి కూడలిలోని జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్‌తో కలసి ఆయన మాట్లాడారు. కృష్ణా నదిలో బోటులను వదిలి బ్యారేజీని దెబ్బతీసేందుకు ప్రయత్నించిన వైసీపీ నాయకులు, వరద బాధితులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని వారు ధ్వజమెత్తారు. టీడీపీ కార్యాలయంపై వైసీపీ నేతలు జరిపిన దాడిని, అక్కడ తోపులాటలో రాళ్లు పడ్డాయని జగన్‌మోహన్ రెడ్డి చెప్పడం సిగ్గు చేటన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన సొంత నిధుల నుంచి వరద బాధితులకు రూ.6 కోట్లు విరాళం అందజేసిన గొప్ప నాయకుడని తెలిపారు. మరో పక్క సీఎం చంద్రబాబు కూడా రాత్రింబగళ్లు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉండి బాధితులకు అందే సాయం స్వయంగా పర్యవేక్షించారని చెప్పారు. ఇవేమి కనిపించని వైసీపీ నాయకులకు, పవన్‌ను, చంద్రబాబును విమర్శించడం చూసి ప్రజలు వైసీపీ నేతల తీరును అస్యహించుకుంటున్నారని ధ్వజమెత్తారు. జిల్లా పర్యటనకు వచ్చిన జగన్‌రెడ్డి బాధిత రైతాంగాన్ని కాకుండా సబ్ జైలులో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పరామర్శించడం చూసి ఆశ్చర్యపోయినట్లు తెలిపారు. రైతులను కలసి పది నిమిషాలు ఓదార్చే సమయంలేని జగన్ రెడ్డికి, మీడియా ఎదుట 45 నిమిషాల పాటు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించేందుకు మాత్రం సమయం ఉందని విమర్శించారు. నదికి, డ్రెయిన్‌కు, కాలువకు తేడా తెలియని వ్యక్తి (జగన్) ముఖ్యమంత్రిగా ఎలా పని చేశాడో తమకు అర్థం కావడం లేదన్నారు. తప్పు చేసిన వారిని కూటమి ప్రభుత్వం విడిచిపెట్టదని, అప్పుడు టైం టేబుల్ వేసుకొని మరీ మాజీ సీఎం జగన్‌రెడ్డి తమ పార్టీ నేతలను పరామర్శించేందుకు జైళ్లకు వెళ్లాల్సి వస్తుందని ఎద్దేవా చేశారు. సమావేశంలో జనసేన కార్పోరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నాయకులు అడపా మాణిక్యాలరావు, చట్టాల త్రినాథ్, పాకనాటి రమాదేవి, యడ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకున్న వైసీపీ



ఎస్ఐ అశోక్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు

రొంపిచర్ల, సెప్టెంబరు 11: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్వగ్రామమైన బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు వైకాపా నాయకులు అడ్డు తగిలారు. మంగళవారం రాత్రి గ్రామంలోని ఉప్పు ఏడుకొండలకు చెందిన సొంత స్థలంలో విగ్రహ నిర్మాణానికి దిమ్మెను ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లో విగ్రహాన్ని ఏర్పాటు చేద్దామనుకుంటున్న తరుణంలో గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు కాలనీకి వచ్చి హల్‌చల్ చేశారు. విగ్రహం ఏర్పాటు చేయవద్దంటూ వారిని బెదిరించారు. తమ అనుమతితోనే ఏ పనులైనా చేయాలని వైసీపీ నాయకులు పేర్కొన్నట్లు వారు తెలిపారు. ఇందిరమ్మ కాలనీలో విగ్రహం ఏర్పాటు ఎలా చేస్తారని వైసీపీ నేతలు ప్రశ్నించినట్లు తెలిపారు. తమను బెదిరించటంపై రొంపిచర్ల పోలీస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. తమ సొంత స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటుంటే ఈ విధంగా చేయటం దారుణమన్నారు. తమకు ప్రాణ హాని ఉందని ఎస్ఐ అశోక్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు 40 మంది కాలనీ వాసులు స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ గ్రామంలోకి వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తామని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రోద్బలంతోనే వైసీపీ నాయకులు తమను బెదిరిస్తున్నారని తెలిపారు.

అక్రమ మైనింగ్ వాస్తవమే..



మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆనంద్, జెస్సీ

నకరికల్లు, సెప్టెంబరు 11: నకరికల్లు మండలంలో క్వార్ట్ అక్రమ మైనింగ్ వాస్తవమేనని ఆ శాఖ అధికారులు నిర్ధారించారు. 'క్వార్ట్‌పై కన్ను' శీర్షికతో అక్రమ తవ్వకాలపై వెలువడిన కథనానికి మైనింగ్ అధికారులు స్పందించారు. బుధవారం మైనింగ్ జరుగుతున్న క్వార్ట్ మైనింగ్ ప్రాంతాలను పరిశీలించారు. మైనింగ్ జరుగుతున్న ప్రాంతానికి, మైనింగ్ అనుమతులు తీసుకున్న ప్రాంతానికి సంబంధం లేకుండా ఉన్నట్లు గుర్తించారు. ఎంత మేర అక్రమంగా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మైనింగ్ జరిగిందనే విషయాన్ని సర్వే చేశారు. ఏయే ప్రాంతాల్లో మైనింగ్ జరిగిందో, ఏ స్థాయిలో జరిగిందో, సర్వే చేసి నివేదిక సిద్ధం చేయనున్నట్లు అసిస్టెంట్ జియాలజిస్ట్ జి. ఆనంద్ తెలిపారు. జిల్లా మైనింగ్ అధికారి నాగిని ఆదేశాల మేరకు తాను, మైనింగ్ సర్వేయర్ జెస్సీ అక్రమ మైనింగ్‌పై విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఏ ప్రాంతానికి అనుమతులు ఉన్నాయి, అనుమతి లేని ప్రాంతాలపై నివేదిక సిద్ధం చేస్తామన్నారు. అక్రమ మైనింగ్‌పై చేజర్ల, నరసింగపాడు, నకరికల్లులో, త్రిపురాపురం కొండ ప్రాంతంలోనూ పరిశీలించినట్లు తెలిపారు. సర్వే నంబరు 97లో మైనింగ్ అనుమతి కోసం రెండు హెక్టార్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, కాని క్లియరెన్స్ రాక ముందే అక్రమంగా మైనింగ్ జరిగినట్లు గుర్తించారు.

వరద బాధితులకు రూ.2 లక్షల విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న దుర్గాప్రసాద్, సతీష్‌శర్మ, మాజీ మంత్రి ఆలపాటి

గుంటూరు, సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ముందుకొచ్చింది. వరద బాధితుల సహాయార్థం రూ.2 లక్షల చెక్కును ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ సీఎం చంద్రబాబుకు విజయవాడలో అందజేశారు. కార్యక్రమంలో సంఘం మహిళా విభాగం కన్వీనర్ కరి నాగలక్ష్మి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు జగన్‌కు లేదు



మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, సెప్టెంబరు 11: ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు జగన్‌కు లేదనీ, ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో కూడా జగన్ తీరు మారలేదని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. టీడీపీ ఆఫీస్‌పై దాడిని సమర్థించుకోవటం దారుణమని, వరద కారణంగా జనం కష్టాల్లో ఉంటే ప్రజలను పరామర్శించకుండా జైలుకు వెళ్లి ఓ క్రిమినల్‌ను పరామర్శించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వైసీపీకి 11 సీట్లు కూడా ఎందుకు ఇచ్చామని ప్రజలు బాధ పడుతున్నారని అనగాని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో సహజ వనరులను దోచుకున్నారని విమర్శించారు. భూములను కబ్జాలు చేసి కోట్లాది రూపాయలు దోచుకున్న ఘనత జగన్‌ది అన్నారు. రాష్ట్రం వరదలు వచ్చి ప్రజలు నానా ఇబ్బందుల్లో ఉంటే వారికి బాసటగా నిలవకపోగా రాజకీయాలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను పరామర్శించాలంటే రోడ్డుపైనే స్టేజీ వేసి రైతులను అక్కడకు తీసుకొచ్చి పరామర్శించారే తప్పా ఎక్కడ మునిగిన ప్రాంతానికి వెళ్లిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడ కలెక్టర్ ఆఫీస్‌ను క్యాంప్ ఆఫీస్‌గా మార్చుకుని 9 రోజుల పాటు అక్కడే ఉండి నిరంతరం వరద బాధితులకు కావాల్సిన ఆహారం, సదుపాయాలను నేరుగా బాధితుల వద్దకే నీళ్లల్లో నడుచుకుంటూ పడవల్లో వెళ్లి అండగా నిలిచారని తెలిపారు. కేంద్ర బృందం బాపట్ల జిల్లాలో లంకగ్రామాల్లో భట్టిప్రోలు మండలంలో కృష్ణా కరకట్ట, రేపల్లె మండలం రావిఅనంతవరం వద్ద పరిశీలించగా చెరుకుపల్లి మండలం కనగాలలో నేటికి వేలాది ఎకరాలు నీటిలోనే ఉన్న పంటను చూపించి ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు.

నోరు విప్ప వద్దనే జగన్ ములాకత్ రాజకీయం



ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, సెప్టెంబరు 11: ప్రకాశం బ్యారేజీని కూల్చి లక్షల మందిని ముంచాలన్న కుట్ర కేసులో మాజీ ఎంపీ నందిగం సురేష్ నోరు విప్ప కూడదనే జగన్ ములాకత్ రాజకీయం చేస్తున్నారని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో విరుచుకుపడ్డారు. ప్రజలు విపత్తుల్లో ఉంటే సాయం చేయాల్సింది పోయి మహా విధ్వంసానికి ప్లాన్ చేసి దొరికిపోవడంతో నిజాలు బయట పడకుండా ఉండేందుకే జగన్ పాట్లు పడుతున్నారని అన్నారు. ప్రకాశం బ్యారేజీ కూల్చేసే కుట్ర వెనుక మాజీ సీఎం జగన్, సజ్జల, శీతల రఘురాం, నందిగం సురేష్ హస్తం ఉందని ఆరోపించారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో గుంటూరు జిల్లా జైల్లో ఉన్న మాజీ ఎంపీ సురేష్‌ను జగన్ ములాకత్‌లో కలవడంపై ఈమేరకు ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. జైల్లో పోలీసులు గట్టిగా అడిగినా తమ పేర్లు ఎక్కడా చెప్ప వద్దని సమాచారం చేరవేయడానికే ఆగమేఘాలపై జగన్ ములాకత్‌కు పరుగులు తీశారన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత జగన్ చేసిన తొలిరాజకీయ పర్యటన నాడు నెల్లూరు జైల్లో ఉన్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో ములాకత్ అని, ఇప్పుడు గుంటూరు జైలుకు వచ్చి నందిగమ సురేష్ పరామర్శకు వచ్చారన్నారు. ఏనాటికైనా జగన్ సహ అతడి బ్యాచ్ మొత్తం జైలుకు పోవడం మాత్రం స్పష్టం అన్నారు.

ప్రత్తిపాటి పుల్లారావుకు మాతృవియోగం



చిన నారాయణమ్మ

చిలకలూరిపేట, సెప్టెంబరు11: మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాతృమూర్తి ప్రత్తిపాటి చిన నారాయణమ్మ(85) గుండెపోటుతో బుధవారం ఉదయం హైదరాబాదులో కన్నుమూశారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతున్నారు. వైద్య సేవలు పొందుతూ హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిన నారాయణమ్మ తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలిసిన వెంటనే పుల్లారావు హుటాహుటిన చిలకలూరిపేట నుంచి హైదరాబాదుకు బయలుదేరి వెళ్లారు. హైదరాబాద్‌లో ఆమె భౌతికకాయం వద్ద ఆయనతోపాటు బంధువులు, శ్రేయోభిలాషులు నివాళులర్పించారు. అనంతరం ఆమె భౌతికకాయాన్ని రాత్రి 7 గంటల ప్రాంతంలో చిలకలూరిపేటకు తీసుకువచ్చారు. గురువారం ఉదయం చిలకలూరిపేటలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పలువురు పట్టణ ప్రముఖులు పుల్లారావు గృహం వద్దకు వచ్చి చిన్న నారాయణమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. చిన నారాయణమ్మ మృతిపట్ల టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

రషీద్ ఎంపికపై హర్షం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 11: ఇండియా-ఏ క్రికెట్ జట్టులో గుంటూరు జిల్లాకు చెందిన షేక్ రషీద్ ఎంపికవ్వడంపై ఆయన తల్లిదండ్రులు, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, అభిమానులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొత్తగా ప్రకటించిన ఇండియా ఏ జట్టులో రషీద్‌కు అవకాశం ఇవ్వడంపై తల్లిదండ్రులు జ్యోతి, బాలీషావలీలు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ జీవితంలో మరపులేని రోజు అంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అండర్-19 వరల్డ్ కప్ గెలుపులో రషీద్ కీలకపాత్ర పోషించాడని, ఐపీఎల్ ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో ఉండి రాణించారని గుర్తుచేశారు. ముఖ్యంగా అండర్-19 వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లో రషీద్ కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడని అన్నారు. క్రికెట పట్ల రషీద్‌కు ఉన్న ఆసక్తిని గమనించి, ప్రత్యేక శిక్షణ ఇప్పించామని, ఆయన ఎదుగుదలలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రోత్సహం ఎంతో ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

30,198 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 32,598 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 30,198 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 19,975 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	7500	15500
నెంబరు. 5	9000	15500
273	10000	13500
341	8000	16000
4884	--	--
సూపర్ 10	10500	10500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18600
బ్యాడిగి	8000	14500
దేవనూరు డీలక్స్	8500	15000
తెల్లకాయలు	4500	12000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8000	15800
నెంబరు. 5	9000	13000
273	10000	12000
341	8500	15000
4884	--	--
సూపర్ 10	--	--
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18500
బ్యాడిగి	8500	13500
దేవనూరు డీలక్స్	9000	15000
తెల్లకాయలు	5000	11000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

జైలు వార్డెన్ అత్యుత్సాహం

- జగన్‌తో సెల్ఫీ దిగి... ఆటోగ్రాఫ్ తీసుకున్న తల్లీకూతురు
- సర్వీసు నిబంధనలు అతిక్రమించిన వార్డెన్ తీరుపై విమర్శలు



జైలు వార్డెన్ ఆయేషాభాను తన కూతురుతో కలిసి జగన్‌తో దిగుతున్న సెల్ఫీ

గుంటూరు, సెప్టెంబరు 11: గుంటూరు జిల్లా జైలులో విధులు నిర్వహిస్తున్న మహిళా జైలు వార్డర్ అత్యుత్సాహం కనబరిచారు. బుధవారం గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ లో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్ ను పరామర్శిం చేందుకు ప్రతిపక్ష నేత జగన్ జిల్లా జైలును సందర్శించారు. అనంతరం ఆయన జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత మీడియాతో మాట్లా డేందుకు సిద్ధమైన తరు ణంలో జైలులో వార్డరుగా పని చేస్తున్న మహిళ ఉద్యోగిణి ఆయేషా భాను యూని ఫామ్‌లో తన కూతురుతో కలిసి అక్కడికి వచ్చారు. 'అన్నా.. నేను మీ అభిమానిని' అంటూ జగన్ దగ్గరకు వెళ్లి ఒక సెల్ఫీ తీసుకుంటామని అడిగారు. అందుకు జగన్ నవ్వుతూ సెల్ఫీకి పోజ్ ఇచ్చారు. ఆ తరువాత 'అన్నా.. ఆటోగ్రాఫ్ ఇవ్వరా' అంటూ పేపరు ఇవ్వడంతో జగన్ దానిపై తన సంతకం చేశారు. సెల్ఫీ దిగి, ఆటోగ్రాఫ్ తీసుకున్న తల్లీకూతురు అక్కడికక్కడే కేరింతలు కొడుతూ సంతోషం వెలిబుచ్చారు. అయితే, అదే సమయంలో అక్కడ ఉన్న మీడియా కెమెరాలు ఈ దృశ్యాలను క్లిక్ మనిపించాయి. బహిరంగ ప్రదేశంలో, అందులోనూ మీడియా సమావేశం జరుగుతున్న సమయంలో విధి నిర్వహణలో ఉన్న, యూనిఫామ్‌లో ఉన్న ఆమె ఈవిధంగా చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అక్కడే విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు సైతం ఆ మహిళా ఉద్యోగి ఈవిధంగా ప్రవర్తించడంపై విస్మయం చెందారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి విధి నిర్వహణలో ఉండగా ఒక రాజకీయ పార్టీ నాయకుడితో ఈవిధంగా చేయడం సర్వీస్ నిబంధనలకు విరుద్ధం. ఈ విషయమై వివరణ అడిగేందుకు జిల్లా జైలు సూపరింటెండెంట్ రఘును సంప్రదించేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. మహిళా ఉద్యోగిపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జగన్ పర్యటనలో రెచ్చిపోయిన వైసీపీ శ్రేణులు

గుంటూరు, సెప్టెంబరు 11 :గుంటూరు జిల్లా జైల్లో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను, అదేవిధంగా నగరంలో ఉన్న పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన ఆళ్ళ సాంబిరెడ్డిని పరామర్శించే నిమిత్తం వైసీపీ అధినేత వైయస్ జగన్ బుధవారం గుంటూరు వచ్చారు. ఈ సందర్భంగా వైసీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. ఎటువంటి అనుమతులు లేకుండా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించడం, జగన్ పర్యటన సందర్భంగా రోడ్డును బ్లాక్ చేసి ఊరేగింపు నిర్వహించడం, దానికి పోలీసులు ఎస్కార్టుగా వాహనాలతో అనుసరించడంతో వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వైసీపీ శ్రేణులు తమ వాహనాలతో రోడ్లపెక్కి రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఏసీ కళాశాల వైపు నుంచి లాడ్జి సెంటర్ వైపు వచ్చే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అదే సమయంలో లాడ్జి సెంటర్ వైపు నుంచి మార్కెట్ వైపు వెళ్లే వాహనాలు కూడా ఓటు వద్ద ట్రాఫిక్ లో ఇరుక్కుపోయాయి. జిల్లా జైలు వద్ద నుంచి జగన్ లాడ్జి సెంటర్ కొరిటపాడు, రింగ్ రోడ్డు మీదుగా గుజ్జనగుండ్ల నుంచి నాలుగో లైన్ల గల సాంబిరెడ్డి ఇంటికి వెళ్లారు. ఈ మార్గంలో కూడా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కార్యకర్తలు అత్యుత్సాహంతో కాన్వాయ్‌ను ముందుకు కదలనివ్వకుండా ఎక్కడికక్కడ అడ్డుపడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు సృష్టించారు. ఇంత జరుగుతున్న పోలీసులు వారిని నియంత్రించే చర్యలు తీసు కోలేదు అంతేగాక ఎక్కడా కూడా పోలీసులు కనిపించలేదు. జగన్ పర్యటనలో జేబు దొంగలు హల్‌చల్ చేశారు.

'అంబేద్కరిజం' పుస్తకావిష్కరణ



నక్కా ఆనంద్‌బాబుకు పుస్తకాన్ని అందజేస్తున్న కొర్రపాటి సురేషు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 11: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆధునిక భారతావని చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన డాక్టర్ బీఆర్ అం బేద్కర్ జీవితం స్ఫూర్తిదాయకమని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు అన్నారు. దళిత ఉద్యమకారుడు కొర్రపాటి సురేష్ రచించిన అంబేద్కరిజం (అం బేద్కర్ జన జాగృతి గీతాలు) పుస్తకాన్ని గుంటూరులో బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని అందరికి చేరువ చేయాలని అన్నారు. కొర్రపాటి సురేష్ మాట్లాడుతూ తాను రచించిన పుస్తకంలో సమాజంలో ఆధునిక భావజాలంతో పాటు అంబేద్కరిజాన్ని మరోసారి గుర్తు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో యానాది హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు టీ.శంకర్‌ప్రసాదు, మలమహానాడు నాయకులు బీ.మనోజ్, కిరణ్, చిన్నా, మల్లిఖార్జునరావు, చంద్రశేకర్, ప్రసాదు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకుల వాహనానికి జెండా ఊపుతున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

ఆపన్న హస్తం అందించాలి: ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి సాటి మనుషులుగా ఆపన్న హస్తం అందించినప్పుడే మనిషి జన్మకు సార్థకత వుంటుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. విజయవాడ వరద బాధితుల కోసం సుమారు రూ. 15 లక్షలు విలువ చేసే నిత్యావసరాలు, ఔషధాలు దుప్పట్లు తీసుకెళ్లే వాహనానికి బుధవారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక డీఎస్ నగర్‌లోని కన్యకా పరమేశ్వరి ఎన్‌క్లేవ్ వద్ద దాతలు వరద బాధితులకు అందజేసిన పలు రకాల వస్తువులను ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వానికి, నాయకులకు, అధికారులకు, సామాన్య ప్రజలకు వరద బాధితులను ఆదు కోవాలని ఉంటే, జగన్‌కు మాత్రం రాష్ట్రాన్ని నాశనం చేయాలని ఉందని విమర్శించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై కమిటీ వేయాలి: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుపై కమిటీని వేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు- 2024కు నిరసనగా బుధవారం ఆయన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులు అల్లా కోసం, పేద ముస్లింల అభ్యున్నతి, అభివృద్ధి కోసం దాతలు సహృదయంతో విరాళం ఇచ్చినవని వాటిమీద ప్రభుత్వాలు జోక్యం చేసుకోవడం సరికాదని అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు- 2024 ను అంజుమన్- ఏ - ఇస్లామియా తరుపున తిరస్కరిస్తున్నామని చెప్పారు. వక్ఫ్ సవరణ బిల్లును తిరస్కరిస్తూ వచ్చే రెండు రోజులు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ బిల్లును తిరస్కరిస్తూ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి మద్దతు తెలపాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ సభ్యులు సైదా, జాహిద్, రఫీ, షరీఫ్, షౌకత్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

15న టైపు రైటింగ్ ప్రీటెక్నికల్ పరీక్షలు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 11: సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే టైపు రైటింగ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు ఈ నెల 15న ప్రీ టెక్నికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ది గుంటూరు సెంటర్ టైప్, షార్టుహ్యాండు అండ్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాససింగ్, సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బ్రాడీపేట 3/10లోని మాస్టర్‌మైండ్స్ పుష్పా భవన్‌లో భరణి టెక్నికల్స్ ప్రిన్సిపల్ టీవీఎస్ ప్రకాశ్‌బాబు సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టైపురైటింగ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఆయా విద్యార్థులు టైపు నేర్చుకునే ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్స్‌ను సంప్రదించాలని సూచించారు.

ముంపు ప్రాంతాల్లో నష్టాన్ని నమోదు చేయాలి

- కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాలను ఫ్లడ్ ఎన్యూమరేషన్ యాప్‌లో సచివాలయం ఉద్యోగులు సక్రమంగా నమోదు చేసేలా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆమె వరద ప్రభావిత ప్రాంతాలలో బాధితులకు జరిగిన నష్టాలను నమోదు చేసే విధానంపై సబ్ కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సచివాలయ ఉద్యోగులతో వర్చువల్ విధానంలో మాట్లాడారు. ఫ్లడ్ ఎన్యూమరేషన్ యాప్‌లో వివరాలు నమోదు చేసే విధానాన్ని కలెక్టర్ వివరించారు. ఆమె మాట్లాడుతూ వరద నీటి వలన బాధితులకు జరిగిన నష్టాలను యాప్‌లో నమోదు చేయడం ద్వారానే ప్రభుత్వం నుంచి వారికి పరిహారం అందించే అవకాశం ఉంటుందన్నారు. వరద ప్రాభావిత ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి.. యాప్‌లో నిర్దేశించిన విధంగా బాధితుల ఇళ్లు, వస్తువులు, వాహనాలు, పశువులు, ఇతర నష్టాలను నమోదు చేయాలన్నారు. బాధితులతో పాటు, నష్టాలకు సంబంధించిన ఫోటోలు, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, సచివాలయాల్లో మ్యాప్ అయిన హౌస్ హోల్డ్ ప్రాతిపదిక యాప్‌లో వివరాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఎన్యూమరేషన్ వివరాలు నమోదుకు ప్రతి సచివాలయానికి ఐదు లాగిన్లు ఇచ్చామని, పది మంది సచివాలయ ఉద్యోగులు వరకు వీటిని వినియోగించుకునే అవకాశం ఉందని వివరించారు. వరద ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని సచివాలయాలకు అదనంగా ఇతర ప్రాంతాల సచివాలయ ఉద్యోగులను నియమించామని, సచివాలయ ఉద్యోగులు ఎన్యూమరేషన్ యాప్‌లో వివరాల నమోదును క్షేత్రస్థాయిలో తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. యాప్‌లో వివరాల నమోదుకు సాంకేతిక సమస్యలు ఉంటే తక్షణమే జిల్లాలోని సచివాలయాల కో-ఆర్డినేటర్‌ను సంప్రదించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ రాజమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

అనుమతి లేని హోర్డింగ్‌ల తొలగింపు



అనధికారిక హోర్డింగ్‌లను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 11 : నగరపాలక సంస్థ అనుమతి లేని, ఫీజులు చెల్లించని ప్రకటనా బోర్డులను, హోర్డింగ్‌లను, ఫ్లెక్సీలను తొలగిస్తామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణా ళిక అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఫీజులు చెల్లించకుండా ఏర్పాటు చేసిన వాటిని బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఏర్పాటు చేసిన ప్రతి ప్రకటనా బోర్డుకు నిర్దేశిత మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులు చెల్లించాలని లేనిపక్షంలో వసూ ళ్లకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనుమతిలేకుండా ఏర్పాటు చేసిన ప్రకటనాబోర్డులు, హోర్డింగ్స్‌ను ఎప్పటికప్పుడు తొలగించేందుకు పట్టణ ప్రణాళిక అధికారులు స్పెషల్ టీమ్‌ను అందుబాటులో ఉంచాలని సిటి ప్లానర్‌ని ఆదేశించారు. వార్డు సచి వాలయాల వారీగా ప్లానింగ్ కార్యదర్శులు అనధికార, ఫీజులు చెల్లించని బోర్డులను గుర్తించి, వాటిని తొలగించాలన్నారు. ఇష్టానుసారం రోడ్లకు అడ్డంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను కూడా తొలగించాలని ఆదేశించారు. రోడ్డు, ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపులో రాజీపడొద్దని ఆదేశించారు. ప్రకటనల బోర్డుల నిర్వాహకులు తప్పనిసరిగా బకాయిలతో పాటుగా ప్రస్తుత ఏడాది డిమాండ్ కూడా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటి ప్లానర్లు అజయ్ కుమార్, మురళి, టిపిఎస్ లు సువర్ణ కుమార్, లక్ష్మణ స్వామి, టిపిబిఓలు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



విజయవాడలో ఆక్రమణలను తొలగిస్తున్న గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు

డ్రెయిన్ల ఆక్రమణలను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నాం

- జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు


గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 11 : విజయవాడలో వరద ప్రభావానికి ప్రధాన కారణమైన డ్రెయిన్ల ఆక్రమణలను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నట్లు విజయవాడలోని 62వ డివిజన్ పర్యవేక్షణ అధికారి, గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన్ చంద్‌తో కలిసి 62వ డివిజన్‌లోని ప్రధాన రహదారుల వెంబడి డ్రెయిన్ల ఆక్రమణలను మూడు జేసీబీలు, చిన్న వీధుల్లో నిలిచిన బురదను ఏడు గల్పర్ యం త్రాల ద్వారా, రెండు జెట్టింగ్ యంత్రాలతో కల్వర్టులను శుభ్రం చేయిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కల్వర్టులను జెట్టింగ్ యంత్రాల ద్వారా, యంత్రాలు వెళ్లేందుకు వీలులేకుండా ఉన్న చిన్న వీధుల్లో గల్పర్ యంత్రాలతో మెగా పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు చెప్పారు. 62వ డివిజన్‌లో వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు సంబంధించి తగిన తోడ్పాటు కోసం అదనపు జేసీబీలు, జెట్టింగ్ యంత్రాలు అందించాలని నగర కమిషనర్ ధ్యాన్‌చంద్‌కి తెలియజేయగా స్పందించిన ఆయన తక్షణం డివిజన్‌కి అందిస్తామని తెలిపారు.

సహాయక చర్యల్లో రవాణా శాఖది కీలక పాత్ర

- ఉప రవాణ కమిషనర్ షేక్ కరీం



గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 11: ఇటీవల విజయవాడ, గుంటూరు జిల్లాలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు జిల్లా రవాణ శాఖ కీలక పాత్ర పోషించిందని ఉప రవాణ కమిషనర్ షేక్ కరీం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వరద సహాయక చర్యలలో భాగంగా ఈ నెల 2 నుంచి 11వ తేది వరకు మొత్తం 669 వాహనాలను ఏర్పాటు చేశామని, ప్రజలను, సిబ్బందిని ఇతర ఆహార ప్యాకెట్ల పంపిణీకి ఆయా వాహనాలను వినియోగించామని అన్నారు. మున్సిపాలిటీ, సివిల్ సప్లయిస్, మార్కెటింగ్, రెవెన్యూ సహకారంతో ఈ వాహనాలను సమకూర్చినట్లు చెప్పారు. అంతేగాక విజయవాడలో వరదల కారణంగా దెబ్బతిన్న వాహనాలకు బీమా క్లైయిమ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశామని, గుంటూరు, పల్నాడు జిల్లాల రవాణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్టాల్స్‌లో క్లైయిమ్‌ల వివరాలు, మెకానిక్‌లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వరద సహాయక చర్యలలో సమర్థవంతంగా పని చేసిన సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.



వాహనానికి జెండా ఊపి ప్రారంభిస్తున్న 'మానవత' ప్రతినిధులు

300 కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 11 : బుడమేరు వరద బాధితుల కోసం రూ.2 లక్షల విలువ గల దుప్పట్లు, నిత్యావసర సరుకులను గుంటూరు లోని మానవత స్వచ్ఛంద సంస్థ బుధవారం పంపింది. విజయవాడ, శాంతి నగర్‌లోని 61వ వార్డులోని 300 వరద బాధిత కుటుంబాల కోసం మూడు వందల బ్యాగ్‌లతో ఉన్న వాహ నానికి జెండా ఊపి మానవత ఛైర్మన్ పావులూరి రమేష్, అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి కె. సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బుడమేరు వరద బాధితుల్లో అత్యధికంగా ఉన్న శాంతినగర్ 61 వ వార్డును ఎంపిక చేసుకున్నామని, అక్కడ స్పెషల్ ఆఫీసర్ ఎం.సూర్య తేజ సహకారాన్ని తీసుకొని ఈ కుటుంబాలను ఎంపిక చేసుకున్నట్లుచెప్పారు. కార్యక్రమంలో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ రెడ్డి, టీఎస్ మిత్రా, టీవీ సాయిరాం, ఏ బాలకృష్ణ చౌదరి, వీ సుబ్రహ్మణ్యం, శివాజీ, ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 11: పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్‌కే విజయలక్ష్మీ పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో 'పరిశుభ్రమైన గాలి నీలి ఆకాశం కోసం'అనే నినాదంతో, పర్యావరణ పరిరక్షణకు తాము పాటుపడతామని వైద్య సిబ్బందితో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. విజయలక్ష్మీ మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్లాస్టిక్, పాలి థిన్ బ్యాగుల వాడకం పూర్తిగా తగ్గించుకోవాలని సూచించారు. సేంద్రీయ ఎరువులతో ఆకుకూరలు, కూరగాయలు పండించాలని, కట్టెలు, బొగ్గు వాడకం పూర్తిగా మాని వేయాలని తెలిపారు. పర్యావరణ పరి రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, ఎపిడమాలజిస్ట్ డాక్టర్ వరప్రసాద్, డెమో ఏ.జయప్రసాద్, డాక్టర్ గిరిధర్ పాల్గొన్నారు.

కుట్ర దారుడితో సమావేశంలో ఆంతర్యమేమిటో ?

- జగన్‌పై ఎమ్మెల్యే గల్లా మాధవి ఆగ్రహం

గుంటూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):అసెంబ్లీ ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితమైన వ్యక్తి, 11వ తేదీన 11 గంటలకు గుంటూరు జిల్లా జైలులో వున్న నందిగం సురేష్‌ను కలవడంలో వున్న అంతర్యం ఏమిటో జగన్‌రెడ్డి ప్రజలకు చెప్పాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి డిమాండ్ చేశారు. టీడీపీ జాతీయ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కుట్ర దారుడుగా ఆరోపణలు ఎదుర్కొంటూ, జైలులో వున్న సురేష్‌ను ఆర్థిక నేరస్థుడు జగన్ కలవడంలో ఆంతర్యమేమిటో బహిర్గత పరచాలని అన్నారు. కుట్ర, కక్ష కలిగిన వ్యక్తి సురేష్ అని, అవే అవలక్షణాలు కలిగిన జగన్, గుంటూరు జిల్లా జైలులో ఉన్న ఆయనను కలవడం వెనుక అతని మనస్తత్వం ఎలాంటిదో ప్రజలు అర్థం చేసుకోవాలని గళ్ళా మాధవి కోరారు. నేరస్థుడు, అక్రమార్జనకు పాల్పడ్డ సురేష్‌కు జగన్ క్లీన్ చిట్ ఇవ్వడం హాస్యాస్పదంగా వుంద న్నారు.

పరామర్శించేందుకు జగన్ రావడం సిగ్గుచేటు : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీని ధ్వంసం చేసేందుకు పూనుకుని అరెస్టయిన నందిగం సురేష్‌ని అతడేదో మహాత్ముడన్నట్లుగా పరామర్శించడానికి వైసీపీ అధినేత జగన్‌రెడ్డి రావడం సిగ్గుచేటని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాటాడారు. రాష్ట్ర ఖజానాని దివాళా తీయించిన మాజీ సీఎం జగన్ రెడ్డి, మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ల పనితీరు ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేసే విధంగా ఉంటుందని అన్నారు. నందిగం సురేశ్ అరాచకాలపై జగన్ రెడ్డి ఎందుకు నోరు విప్పలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వరదలతో విజయవాడ నగరం మునిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ఎందుకు వచ్చాడో తెలియని జగన్ రెడ్డి 'బుడమేరు గేట్లు, బుడమేరు నది' అని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ప్రకాశం బ్యారేజ్ ఘటనలో నిందతులను వదిలి పెట్టే ప్రసక్తే లేదని అన్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు

గుంటూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) సకల కార్యాలయాల శిద్ధి, బుద్ధి, వృద్ధి చెందడానికి గణపతిని పూజించడం ఆనవాయితీగా వస్తుందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. వినాయక చవితి ఐదో రోజు సంద ర్భంగా నియోజకవర్గంలోని పలు మండపాలలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

సంఘటిత పోరుతోనే హక్కుల సాధన

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 11: ఐక్య పోరుతోనే హక్కులు సాధ్యమవుతాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కే.ఉమామహేశ్వరరావు అన్నారు. ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూని యన్(సీఐటీయూ) జిల్లా 4వ మహాసభ చింతల శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం పాతగుంటూరు సీఐ టీయూ కార్యాలయంలో జరిగింది. మహాసభకు సీఐ టీయూ మరో రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయాంలో పంచాయతీకి రావాల్సిన నిధులను దారి మళ్ళించిందని ఫలితంగా గ్రామాభివృద్ధి కుంటుపడిందని అన్నారు. ప్రస్తుత ప్రభు త్వం కూడా కార్మికుల జీత భత్యాల గురించి మాట్లాడక పోవడం బాధాకరమని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం లేదని విమర్శించారు.

బావమరిదిపై బావ హత్యాయత్నం

గుంటూరు, సెప్టెంబరు 11 :స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కెవిపి కాలనీలో భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంలో బావమరిదిపై బావ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కేవీపీ కాలనీకి చెందిన షేక్ ఫయాజ్ చెల్లెలు షఫీయా, అదే ప్రాంతానికి చెందిన రెడ్డి సురేంద్ర గతంలో ప్రేమించుకుని మతాంతర వివాహం చేసుకున్నారు. కొంతకాలంగా వారిమధ్య మనస్పర్ధలు వచ్చి గొడవలు పడుతున్నారు. మంగళవారం రాత్రి మద్యం సేవించిన సురేంద్ర భార్యపై గొడవ పడ్డాడు. దీంతో ఆమె పక్కనే ఉంటున్న అన్న ఫయాజ్ వద్దకు వెళ్ళింది. అయితే సురేంద్ర అక్కడకు కూడా వెళ్లి భార్యతో గొడవ పడుతుండగా, ఫయాజ్ సర్దిచెప్పాలని చూడగా సురేంద్ర తన చేతిలో ఉన్న బ్లేడుతో ఫయాజ్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఫయాజ్ ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

గుంటూరు, సెప్టెంబరు 11 : పలకలూరు రోడ్డులోని కరెంట్ ఆఫీస్ ఎదురు రోడ్డులోని సాయికృష్ణనగర్‌లో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. రోడ్డుపై వెళ్లే వారిని దొరికిన వారిని దొరికినట్టు కరిచింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఓ వ్యక్తి పరిస్థితి విషమంగా మారింది. సాయికృష్ణనగర్ ఆరవ లైన్ కి చెందిన సుమారు 65 ఏళ్ల వృద్ధుడు ఇంటి నుంచి రోడుపైకి నడుచుకుంటూ వస్తుండగా ఓ పిచ్చి కుక్క దాడి చేసి అయనను తీవ్రంగా గాయపరిచింది. పిచ్చి కుక్క బారినపడ్డ వృద్ధుడిని రక్షించేందుకు స్థానికులు ప్రయత్నించగా వారిపైన దూకడంతో వారు పారి పోయారు. ఆ తర్వాత ఆ పక్కనే ఉన్న ప్రాంతంలోకి వెళ్లిన కుక్క అక్కడ మరో ఇద్దరిపై ఇదేవిధంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. తీవ్రంగా గాయపడిన వృద్ధుడికి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు స్పష్టం చేశారు. కాగా, స్థానికులు కర్రలతో వెంటపడి పిచ్చికుక్కను తరిమికొట్టారు.

వినాయక నిమజ్జనంలో అపశృతి

గుంటూరు, సెప్టెంబరు 11 : స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్ అగ్రహారం సంపత్‌నగర్ రోడ్డులో బుధవారం రాత్రి వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా అపశృతి చోటుచేసుకుంది. రాత్రి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇందుకుగాను ఆటోలో పెద్ద ఎత్తున బాణాసంచా తీసు కొచ్చారు. నిమజ్జనానికి తరలించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో బాణసంచా కాల్చారు. అందులోని నిప్పు రవ్వలు ఎగిరి పక్కనే బాణాసంచా ఉంచిన ఆటోపై పడటంతో మంటలు అంటుకొని పేలడంతో అందరూ పరుగులు తీశారు. దాసరి తిరుపతిరావు కుమారుడు ఆరేళ్ల వెంకట గోపయ్య ఆటో పక్కనే నిలబడి ఉండటంతో అంటుకుని శరీరం కాలింది. మరో ఇద్దరు యువకులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. జీజీహెచ్‌కు తరలించారు. లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేంజ్‌లో ఇద్దరు సీఐలకు పోస్టింగ్స్

గుంటూరు, సెప్టెంబరు 11 : రేంజి పరిధిలో ఇరువురు సీఐలకు పోస్టింగ్ ఇస్తూ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఇద్దరు సీఐలకు పోస్టింగ్స్ లభించాయి. రేంజి వీఆర్‌లో ఉన్న కె.అంజయ్యను తుళ్లూరు ఎస్‌హెచ్ఓ-2గా నియమించారు. రేంజి వీఆర్‌లో ఉన్న షేక్ మహమ్మద్ నిషార్ బాషాను తెనాలి టూ టౌన్ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు.

పులివర్తి రామలక్ష్మమ్మ సంస్మరణ సభ

- ప్రముఖుల ఘన నివాళి



గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 11: గుంటూరు వెంకటేష్ కన్‌స్ట్రక్షన్స్, ప్రధాన్ హాస్పిటల్స్ అధినేత పులివర్తి శేషగిరి రావు మాతృమూర్తి పులివర్తి రామలక్ష్మమ్మ సంస్మరణ సభ బుధవారం స్థానిక శుభం కళ్యాణ మండపంలో జరిగింది. నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో చిత్తూరు జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో పాటు, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్ బాబు, కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ల నరేంద్ర, అబ్దుల్ నజీర్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, కాటూరి మెడికల్ కాలేజ్ ఛైర్మన్ కాటూరి సుబ్బారావు, భాష్యం స్కూల్స్ అధినేత భాష్యం రామకృష్ణ, ఆర్కి టెక్ట్ నన్నపనేని శంకరయ్య, పరమహంస, డాక్టర్ వై.లక్ష్మణస్వామి, యర్రా నాగేశ్వరరావు, వీవీఐటీ ఇంజనీరింగ్ కళాశాల అధినేత సాగర్, శ్రీకృష్ణ, కోవెలమూడి రవీంద్ర, పలువురు డాక్టర్లు, రాజకీయ నాయకులు ఉన్నారు.

వ్యాధుల నుంచి రక్షణపై అవగాహన కల్పించిన 'విజ్ఞాన్' విద్యార్థులు



వరద బాధితులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

గుంటూరు (విద్య)సెప్టెంబరు 11: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విజయవాడ వరద ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలకు అధిక వర్షం, వరదల వచ్చే కాలానుగుణ వ్యాధుల నుంచి రక్షణ ఎలా పొందాలో అవగాహన కల్పించారని వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ బుధవారం తెలిపారు. యూనివర్సిటీకి చెందిన 280 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మూడు గ్రూపులుగా విడిపోయి విజయవాడలోని తోటవారి వీధి, నందమూరినగర్, ఇందిరా కాలనీల్లోని ప్రజలకు వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారని తెలిపారు. వరద సహాయక చర్యల సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పి నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎమ్మెస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్స్, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో 'భాష్యం' విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని భావనశౌర్యను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు (విద్య)సెప్టెంబరు 11: చదువులోనే కాకుండా ఇతర రంగాల్లో కూడా తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక మెయిన్ క్యాంపస్ లో రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించిన భాష్యం మెడెక్స్ విద్యార్థిని వంకాయలపాటి భావనశౌర్యను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 23న హైదరాబాద్ గచ్చి బౌలిలోని హైదరాబాద్ యూనివర్శిటీలో రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వ ర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో సీనియర్/జూనియర్ 50 మీటర్ల విభాగంలో భావనశౌర్య ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించి ఉమెన్ ఛాంపియన్ షిప్ చేజిక్కించుకుందని అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 2023లో నిర్వహించిన అండర్-19 విభాగంలో 10 మీటర్ల రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొని మన రాష్ట్రం తరపున ప్రాతి నిధ్యం వహించినట్లు రామకృష్ణ తెలిపారు. భావనశౌర్య భవిష్యత్ లో మరిన్ని ఉన్నత విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు పాల్గొన్నారు.

పింఛన్ మంజూరులో నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రపతికి ఫిర్యాదు చేయొచ్చు

- ఈదర వీరయ్య

గుంటూరు, సెప్టెంబరు 11 : చందాతో కూడిన పింఛన్ పథకం పరిధిలోకి వచ్చే ఉద్యోగి మరణిస్తే కుటుంబానికి పింఛన్ మంజూరులో నిర్లక్ష్యం వహించే అధికారులపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేయవచ్చని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రథమ పౌరుడు రాష్ట్రపతిగా అత్యున్నత హోదా కలిగిన వ్యక్తి ప్రణబ్‌ముఖర్జీ రాష్ట్రపతిగా ఎన్నికైన తరువాత తన దైన శైలిలో ప్రజలు కష్టాలు వినేందుకు, అక్రమార్కులపై కొరడా ఝుళిపించేందుకు అప్పట్లో ఆయన ప్రత్యేక వెబ్ పోర్టల్ ప్రారంభించారని తెలిపారు. దీనికి బాధితులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా. ఎన్ఐసీ. ఇన్ వెబ్‌సైట్‌కి లాగిన్ అయి, వెబ్‌సైట్ తెరచుకోగానే పైన ది ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా అని కనిపిస్తూ వెబ్, హోం పేజీ దర్శనమిస్తుందని, వెబ్ పేజీలోని ఎడమ భాగాన మెనూలో హెల్ప్‌లైన్ పోర్టల్ కనిపిస్తుందని పేర్కొన్నారు. బాధితులు ఈ హెల్ప్‌లైన్ పోర్టల్ క్లిక్ చేయగానే ప్రెసిడెంట్ సెక్రటేరియట్ హెల్ప్‌లైన్ అని పైన ఉండగా దాని కింద కుడి వైపున లాడ్జి ఎ రిక్వెస్ట్ అని ఉంటుందని తెలిపారు. ఈ లాడ్జి ఎ రిక్వెస్ట్‌ని క్లిక్ చేసి అప్పుడు రిజిస్ట్రేషన్ ఫారాన్ని బాధితులు పూరించాలన్నారు. ప్రజా సమస్యలతో పాటు పింఛన్ మంజూరులో అధికారుల నిర్లక్ష్యంలో అసాంఘిక శక్తులపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేసి న్యాయం పొందాలని వీరయ్య కోరారు.



వరదబాధితుల కోసం సేకరించిన విరాళం రూ.1,84,500 చెక్కును బుధవారం సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రకటన

మహారాజశ్రీ మార్కాపురం 6వ అదనపు జిల్లా కోర్టులో, ప్రకాశం జిల్లా.

EP No: 2/2020. Dispute No: 116/2014

వెంకట తిరుమల చిట్‌ఫండ్ ప్రై.లిమిటెడ్, నరసరావుపేట. రిప్రజెంటెడ్ బై మేనేజర్ (ఫోర్‌మెన్ -- DHR పిటీషనర్

Vs

కంచరగుంట రాధాకృష్ణమూర్తి వగైరాలు -- JDR రెస్పాండెంటు

Notice Under order 21 Rule 22 CPC, To JDRs 6,7,8 L.Rs. of Deceased JDR 1. K. రాధాకృష్ణమూర్తి

To. JDR 6. కంచరగుంట రజని W/o. రాధాకృష్ణమూర్తి JDR 7. కంచరగుంట శ్రీతేజ D/o. రాధాకృష్ణమూర్తి JDR 8. కంచరగుంట శ్రీహర్ష S/o. రాధాకృష్ణమూర్తి, ఫ్లాట్ నెం. జి1, దూర్జటి హోమ్స్, 5వ లైను, అన్నపూర్ణనగర్, గోరంట్ల, గుంటూరు, గుంటూరు జిల్లా.

యిందలి DHRకు కంచర్ల రాధాకృష్ణమూర్తి వలన రావలసిన డిక్రి బాకీ వసూలు నిమిత్తం, అయన చనిపోయిన దరిమిలా ఆయన ఆస్తిపై జప్తు చేసి వేలం వెయించి వసూలు కాగలందుకుగాను మీపై పై నెంబర్ EP 2/2020 వ పై కోర్టు వారి యందు అమలు దరఖాస్తు చేయగా పై నెంబర్ EPని ఎందుకు అమలు చేయకూడదో కోరుచూ మీకు ఆర్డర్ 21 రూల్ 22 నోటీస్ నిమిత్తం ఎన్ని సార్లు కోర్టు ద్వారా నోటీస్ పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందు వలన పై నెంబర్ EP లో మీకు ఆర్డర్ 21 Rule 22 నోటీస్ జారీ కాగలందుకు గాను ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీస్ జారీకాగలందులకు గాను పై కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయవలసినదిగా ది. 3-9-2024వ తేదిన ఆర్డర్ చేసినారు. కావున మీరు 6 టు 8 JDR లను పై కోర్టు వారి ఎదుట ది. 4-10-2024ను హాజరై మీకు గల అక్షేపణలు తెలియజేయవలసినదిగా ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయటమైనది. కావున మీరు పై కోర్టు వారి ఎదుట ది. 4-10-2024వ తేదిన స్వయంగాని లేదా న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు అక్షేపణలను తెలియజేయవలసినదిగా ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయటమైనది. లేని యెడల మీ పై పరోక్షంగా EP తీర్మానం చేయబడును. ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయటమైనది.

వాయిదా తేది : 4-10-2024

ఇట్లు : ముత్తవరపు వెంకటేశ్వర్లు చౌదరి
DHR తరపు న్యాయవాది, నరసరావుపేట.

అందరికీ రిలేట్ అవుతుంది

'బెంచ్ లైఫ్' వెబ్ సిరీస్‌తో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు మానస శర్మ. తమిళ నటుడు వైభవ్, చరన్ పెరి, రాజేంద్ర ప్రసాద్, రితికా సింగ్, అకాంక్ష సింగ్ ప్రధాన పాత్రలు పోషించారు. నిహారిక కొణిదెల నిర్మించారు. ఈ శుక్రవారం ఓటీటీ సంస్థ 'సోనీ లైవ్'లో విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది.



నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ "ఇది కార్పొరేట్ ఉద్యోగుల కథ అయినా.. అందరికీ రిలేట్ అవుతుంది. వినోదంతో పాటు.. మంచి భావోద్వేగాలు ఇందులో ఉంటాయి. అద్భుతమైన కంటెంట్ ఉన్న ఈ వెబ్ సిరీస్ తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు. దర్శకురాలు మానస శర్మ మాట్లాడుతూ "నేను జాబ్ చేస్తున్నప్పుడు ఎదురైన అనుభవాలు.. లైఫ్‌లో చూసిన అనేక సంఘటనలను స్ఫూర్తిగా తీసుకొని తెరకెక్కించిన వెబ్ సిరీస్ ఇది. ప్రతీ పాత్రకూ ఓ కథ ఉంటుంది. ఇందులోని నటీనటులు పంచే వినోదం చాలా కాలం గుర్తుంటుంది" అని చెప్పారు. నటుడు చరణ్ పెరి మాట్లాడుతూ "స్నేహ మాధుర్యాన్ని.. అభిరుచులను సరికొత్తగా ఆవిష్కరించే సిరీస్ ఇది" అని అన్నారు.

విడాకుల విషయం నాకు తెలియదు



ఆర్తి రవి

తనకు తెలియకుండా, తన సమ్మతి లేకుండా తన భర్త విడాకుల ప్రకటన చేశారంటూ ఆర్తి రవి బుధవారం ప్రకటన విడుదల చేయడంతో తమిళ హీరో జయం రవి విడాకుల వ్యవహారం సరికొత్త మలుపు తిరిగింది. ఈ విషయంపై ఆమె విడుదల చేసిన ప్రకటనలో.. 'మా వైవాహిక జీవితం గురించి మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు చూసి ఆందోళనకు గురయ్యాను. 18 ఏళ్ళుగా పరస్పర విశ్వాసం, గౌరవంతో కుటుంబ జీవితాన్ని గడుపుతున్నాం. ఈ విడాకుల ప్రకటన వల్ల మా గౌరవ మర్యాదలతో పాటు వ్యక్తిత్వాన్ని కోల్పోయినట్టుగా భావిస్తున్నాను. నా భర్తతో మాట్లాడాలని, కలవాలని ఎన్నోసార్లు ప్రయత్నం చేశాను. కానీ, నాకు అలాంటి అవకాశం దక్కలేదు. నేను, నా పిల్లలు ఇబ్బంది పడుతున్నాం. వైవాహిక బంధం నుంచి వైదొలగాలనే ఈ నిర్ణయం పూర్తిగా ఆయన సొంతంగా తీసుకున్నది. దీనిపై బహిరంగంగా వ్యాఖ్యానించదలచుకోలేదు. అయితే, నా వ్యక్తిత్వానికి కళంకం కలిగించేలా బహిరంగంగా జరుగుతున్న ప్రచార దాడులను సహించలేకపోతున్నాను. ఈ అసత్య ప్రచారాన్ని తిరస్కరించడం నా తొలి కర్తవ్యం' అని ఆర్తి రవి పేర్కొన్నారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)



భారీ వర్షాలు, వరదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలను ఆదుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌కు కలిపి హీరో సాయిదుర్గ తేజ్ రూ. 20 లక్షలు విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. బుధవారం ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు రూ. పది లక్షల చెక్కును విజయవాడలో అందించారు సాయి దుర్గ తేజ్. అలాగే అమ్మ అనాథాశ్రమానికి రూ. రెండు లక్షలు, ఇతర సేవా సంస్థలకు రూ. మూడు లక్షలు విరాళంగా అందించారు

సాహసనారి సంయుక్త



నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ'. పీరియాడిక్ వార్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో నిఖిల్‌కు జోడీగా నభానటేష్, సంయుక్త నటిస్తున్నారు. బుధవారం సంయుక్త పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. యుద్ధ భూమిలో విల్లును ఎక్కుపెడుతున్న యోధురాలిగా ఆమె లుక్ అలరించింది. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. అలాగే శర్వానంద్ సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం (శర్వా 37-వర్కింగ్ టైటిల్) నుంచి ఆమె పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో దియా అనే పాత్రలో ఆమె కనిపించనున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలోనూ సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. మహేశ్ చందు నిర్మాత. సమీరా అనే పాత్రలో సంయుక్త నటిస్తున్నారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా యూనిట్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది.

మలైకా ఇంట విషాదం



బాలీవుడ్ నటి మలైకా అరోరా ఇంట్లో విషాద ఘటన జరిగింది. మలైకా సవతి తండ్రి అనిల్ మెహతా ముంబైలో ఆరు అంతస్థుల భవంతి నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. ఆయనను ఆస్పత్రిలో చేర్పించారు. కానీ అప్పటికే ఆయన చనిపోయారని వైద్యులు తెలిపారు. అయితే అనిల్ మెహతాది ఆత్మహత్య కాదా అనే విషయం అధికారికంగా తెలియాల్సి ఉంది.

ఉన్నత విద్యలో ఇక ఒకే విధానం

» అన్ని యూనివర్సిటీలు, కాలేజీలకు వర్తింపు

» 2024-25 అకడమిక్ క్యాలెండర్ విడుదల

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో ఏకరూప విధానాన్ని అమలు చేసేందుకు ఉన్నత విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. డిగ్రీ, బీటెక్, ఫార్మసీ కోర్సులకు ఉన్నత విద్యాశాఖ 2024-25 అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏటా అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్నా యూనివర్సిటీలు దాన్ని అమలుచేయడం లేదు. ఒక్కో యూనివర్సిటీ ఒక్కోలా పరీక్షలు నిర్వహించుకుంటున్నాయి. ఇకపై అన్ని వర్సిటీలు ఒకే విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే బోధన, పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది.

డిగ్రీ కోర్సులకు ఇలా..

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సాధారణ డిగ్రీ కోర్సుల సెమిస్టర్-1 తరగతులు ఆగస్టు 12న ప్రారంభమవుతాయి. డిసెంబరు 9 నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయి. జనవరి 10న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-2 డిసెంబరు 23న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 21 నుంచి మే 3 వరకు పరీక్షలు జరుగుతాయి. మే, జూన్ నెలల్లో ఎనిమిది వారాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు ఉంటుంది. మే 24న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-3 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 23 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 13న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-4 నవంబరు 25న ప్రారంభవుతుంది. ఏప్రిల్ 21 నుంచి జూన్ 14 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్, జూన్ నెలల్లో ఎనిమిది వారాల షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. సెమిస్టర్-5 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 23 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 13న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-6 నవంబరు 25న ప్రారంభమవుతుంది. మార్చి 24 నుంచి ఏప్రిల్ 5 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-7 జూలై 1న ప్రారంభమవుతుంది. నవంబరు 4 నుంచి 16 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 7న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-8 నవంబరు 18న ప్రారంభమవుతుంది. మార్చి 24 నుంచి ఏప్రిల్ 5 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు విడుదల చేస్తారు.

బీటెక్‌కు ఇలా..

ఇంజనీరింగ్ సెమిస్టర్-1 తరగతులు ఆగస్టు 1న ప్రారంభమవుతాయి. డిసెంబరు 16 నుంచి జనవరి 4 వరకు పరీక్షలు జరుగుతాయి. జనవరి 25న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-2 జనవరి 6న ప్రారంభమవుతుంది. జూన్ 2 నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయి. జూలై 11న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-3 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 30 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 21న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-4 డిసెంబరు 2న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 7 నుంచి 26 వరకు పరీక్షలు జరుగుతాయి. మే 17న ఫలితాలు ప్రకటిస్తారు. ఏప్రిల్, జూన్ నెలల్లో 8 వారాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు ఉంటుంది. సెమిస్టర్-5 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 30 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 21న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-6 డిసెంబర్ 2న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 7 నుంచి 26 వరకు పరీక్షలు జరుగుతాయి. 8వారాల షార్ట్ టర్మ్ ఇన్‌టర్న్‌షిప్ ఉంటుంది. మే 17న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-7 జూలై 29న ప్రారంభమై.. నవంబరు 25 నుంచి డిసెంబరు 14 వరకు పరీక్షలుంటాయి. జనవరి 4న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-8 డిసెంబరు 16న ప్రారంభమై.. ఏప్రిల్ 15 నుంచి 19 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు ప్రకటిస్తారు.

డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్ మార్పు

మూడో విడత డిగ్రీ అడ్మిషన్లకు ఇటీవల విడుదల చేసిన షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి సవరించింది. రిజిస్ట్రేషన్ గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించింది. 11 నుంచి 18 వరకు విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని, 19న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని తెలిపింది. 22న సీట్ల కేటాయింపు జరుగుతుందని, 22 నుంచి 25లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని పేర్కొంది.

జెత్వానీ మొబైల్ ఫోన్ ఎక్కడ?

» వివరాలు తమ ముందుంచాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ నుంచి సీజ్ చేసిన మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయో చెప్పాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వాటిని భద్రపరిచేందుకు తీసుకున్న చర్యలను తెలపాలని కోరింది. ఎలక్ట్రానిక్ పరికరాలను భద్రపరచాలని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చుకొని తన వాదనలు వినిపించేందుకు అనుమతించాలంటూ కాదంబరి దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. జెత్వానీ నుంచి పోలీసులు సీజ్ చేసిన పరికరాలను నిందితురాలికి వెనక్కి ఇవ్వకుండా ఆదేశించాలని కోరుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా, కోసూరుకు చెందిన కేవీఆర్ విద్యాసాగర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. జెత్వానీ తరఫు న్యాయవాది నర్రా శ్రీనివాస్.. వ్యాజ్యంలో ఇంప్లీడ్ అయి వాదనలు వినిపించేందుకు అనమతించాలని కోరారు.

రహదారుల భద్రతపై హైకోర్టులో పిల్

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రహదారుల భద్రత, నిర్వహణ విషయంలో సుప్రీంకోర్టు కమిటీ ఇచ్చిన మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలు చేయట్లేదంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న కేంద్ర రవాణాశాఖ కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సీఎస్, రవాణాశాఖ కార్యదర్శి, పురపాలకశాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి, రహదారుల అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజనీర్, రవాణాశాఖ కమిషనర్, డీజీపీ తదితరులకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

వరద బాధితులకు ఆపన్నహస్తం

కోటి ఇచ్చిన డిక్షన్, జీవీపీఆర్ ఇంజనీర్స్, నెక్కంటి సీ ఫుడ్స్, సంధ్య ఆక్వా

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం దాతలు స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధికి తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. బుధవారం సాయంత్రం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి పలువురు విరాళాల చెక్కులు అందజేశారు. సంధ్యా మెరైన్స్ కేవీ ప్రసాద్ రూ.కోటి, జీవీపీఆర్ ఇంజనీర్స్ లిమిటెడ్ ఛైర్మన్ జీఎస్‌పీ వీరారెడ్డి, ఎండీ శేఖర్‌రెడ్డి రూ.కోటి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ సత్యప్రకాష్‌సింగ్ రూ.86 లక్షలు, వైశాఖి ఫౌండేషన్ ఎల్లంకి రవికుమార్ రూ.50 లక్షలు, దర్శి నియోజకవర్గ ప్రజల తరఫున రూ.37,16,200, మోడల్ డైరీ ఎండీ పీ ధనప్రకాష్ రూ.30 లక్షలు, నార్త్ అమెరికా కమ్మ సంఘం రూ.30 లక్షలు, దర్శి నియోజకవర్గ టీడీపీ మహిళా నేత గొట్టిపాటి లక్ష్మీ రూ.10 లక్షలు, మణిపాల్ హాస్పటల్స్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి, అసోసియేట్ డైరెక్టర్ జే రామాంజనేయరెడ్డి రూ.25 లక్షలు, ఆఫ్రికా, కెన్యా టీడీపీ తరఫున బొబ్బా శివప్రకాష్ రూ.20 లక్షలు, ది సిటిజన్ కోఆపరేటీవ్ సొసైటీ ఛైర్మన్ రాజు, ఎండీ కేవీ సుబ్బయ్య రూ.10 లక్షలు, గుంటూరు డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రూ.1,84,500 సీఎంకు అందజేశారు. కాగా, అమరావతి సచివాలయంలో.. డిక్షన్ గ్రూప్ కంపెనీ ప్రతినిధులు రూ.కోటి, నెక్కంటి సీ ఫుడ్స్ యాజమాన్యం రూ.కోటి, సంధ్య ఆక్వా రూ.కోటి చెక్కును మంత్రి లోకేశ్‌ని కలసి అందజేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.25 లక్షలు, రేస్ పవర్ సంజయ్‌గుప్తా రూ.25 లక్షలు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి రూ.11 లక్షలు, సినీ హీరో సాయి ధరమ్ తేజ్ రూ.10 లక్షలు అందజేశారు. కాగా, మంత్రి టీజీ భరత్ విజయవాడలోని ఊర్మిళా నగర్‌లో వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు.

తెనాలి వార్తలు



చవితి ఉత్సవాల్లో స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి మనోహర్, జనసేన నేతలు

ప్రజలంతా సంతోషంగా ఉండాలి

● పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్

తెనాలి రూరల్, సెప్టెంబరు 11: విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం రాత్రి మంత్రి మనోహర్ మండలంలోని నందివెలుగు, సంగంజాగర్లమూడి గ్రామాల్లో నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆయా కమిటీ నిర్వాక సభ్యులు మంత్రి మనోహర్‌ను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి స్వామి వారి దర్శనం అనంతరం దుశ్శాలువాలతో సత్కరించి ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో జనసేన నేతలు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణారావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నిర్వాహక కమిటీ సభ్యులు, జనసేనసైనికులు, వీరమహిలలు పాల్గొన్నారు.



ఖాళీ స్థలాలలో నిలిచిన నీటిలో ఆయిల్ బాల్స్‌ను వేస్తున్న కమీషనర్ శేషన్న, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల తదితరులు

ఖాళీ స్థలాలలో నీటి నిల్వలు లేకుండా చూడండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 11: పట్టణంలో గృహ నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న స్థల యజమానులకు సూచించారు. స్థానిక 12వ వార్డు డొంక రోడ్డులో బుధవారం నీరు నిల్వవున్న ఖాళీ స్థలాల్లో దోమల నివారణ నిమిత్తం పారిశుధ్య కార్మికులు ఆయిల్ బాల్స్‌ను వేశారు. కమిషనర్ శేషన్న దగ్గరుండి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పట్టణంలో పారిశుధ్యంతో పాటు దోమల నివారణకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఖాళీ స్థల యజమానులు తమ స్థలాలో పిచ్చి చెట్లను తొలగించాలని, నీటి నిల్వలు లేకుండా మెరకలు వేయించాలని ఆదేశించారు. ఖాళీ స్థలాలలో స్థల యజమానులు పరిశుభ్రత పాటించకుంటే పురపాలక సంఘం చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, నిల్వ ఉన్న ఆహారం తీసుకోరాదని, దోమతెరలు ఉపయోగించాలని తెలిపారు. తద్వారా డెంగీ, మలేరియా, డయోరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు.కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీ.శ్రీనివాసరావు, శానిటరీ సెక్రటరీలు కే.సంధ్య, శాంతి, హవీల, ప్రవీణ్, సాగర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



బొబ్బర్లంకలో నిత్యవరస కిట్లు, దుప్పట్లు అంద చేస్తున్న రోటరీ నిర్వాహకులు

వరద బాధితులకు సామగ్రి పంపిణీ

పొన్నూరుటౌన్ : పొన్నూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వరద బాధితులకు బుధవారం రూ. 5లక్షల విలువైన వస్తు సామగ్రిని పంపిణీ చేసారు. రేపల్లె, పెనుమూడి వారధి సమీపంలోని పల్లెపాలెం, బొబ్బర్లంక గ్రామాలో 400 కుటుంబాలకు రూ. వెయ్యి విలువ గలిగిన నిత్యవసర వస్తువులు, దుప్పట్లు, టవళ్లు అందజేశారు. అలాగే ఆయా ప్రాంతాల్లో వైద్యశిబిరాలను నిర్వహించారు. కార్యక్రమంలో పొన్నూరు రోటరీ క్లబ్ కార్యదర్శి నన్నపనేని బాలకృష్ణ, బండారుపల్లి శ్రీనివాసరావు, తోట భాను ప్రసాద్, రేపల్లె, చీరాల, బాపట్ల, పిడుగురాళ్ల, తెనాలి, గుంటూరు రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

తెనాలి అర్బన్, సెప్టెంబరు 11 : ఐతానగర్ ఎన్‌ఎస్‌ఎస్‌ఎం హైస్కూల్‌లో బుధవారం పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవడం ఎలా చేయాలో ప్రత్యక్షంగా వివరించారు. హెచ్‌ఎం ప్రసూనదేవి, బెల్లంకొండ వెంకట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘర్షణపై పోలీసులకు ఫిర్యాదు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు11: వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన ఘర్షణ నేపథ్యంలో బుధవారం రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు గ్రామానికి చెందిన ఇరు వర్గాలు వినాయక నిమజ్జనం సందర్భంగా ఘర్షణ పడ్డాయి. దూషణలు పెరిగి ఘర్షణలకు దారి తీయగా రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఘర్షణలు అదుపు చేసారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముంపు ప్రాంతాల్లో నష్టాన్ని నమోదు చేయాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాలను ఫ్లడ్ ఎన్యూమరేషన్ యాప్‌లో సచివాలయం ఉద్యోగులు సక్రమంగా నమోదు చేసేలా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆమె వరద ప్రభావిత ప్రాంతాలలో బాధితులకు జరిగిన నష్టాలను నమోదు చేసే విధానంపై సబ్ కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సచివాలయ ఉద్యోగులతో వర్చువల్ విధానంలో మాట్లాడారు. ఫ్లడ్ ఎన్యూమరేషన్ యాప్‌లో వివరాలు నమోదు చేసే విధానాన్ని కలెక్టర్ వివరించారు. ఆమె మాట్లాడుతూ వరద నీటి వలన బాధితులకు జరిగిన నష్టాలను యాప్‌లో నమోదు చేయడం ద్వారానే ప్రభుత్వం నుంచి వారికి పరిహారం అందించే అవకాశం ఉంటుందన్నారు. వరద ప్రాభావిత ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి.. యాప్‌లో నిర్దేశించిన విధంగా బాధితుల ఇళ్లు, వస్తువులు, వాహనాలు, పశువులు, ఇతర నష్టాలను నమోదు చేయాలన్నారు. బాధితులతో పాటు, నష్టాలకు సంబంధించిన ఫోటోలు, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, సచివాలయాల్లో మ్యాప్ అయిన హౌస్ హోల్డ్ ప్రాతిపదిక యాప్‌లో వివరాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఎన్యూమరేషన్ వివ రాలు నమోదుకు ప్రతి సచివాలయానికి ఐదు లాగిన్లు ఇచ్చామని, పది మంది సచివాలయ ఉద్యోగులు వరకు వీటిని వినియోగించుకునే అవకాశం ఉందని వివరించారు. వరద ప్రభావం ఎక్కువుగా ఉన్న ప్రాంతాల్లోని సచివాలయాలకు అదనంగా ఇతర ప్రాంతాల సచివాలయ ఉద్యో గులను నియమించామని, సచివాలయ ఉద్యోగులు ఎన్యూమరేషన్ యాప్‌లో వివరాల నమోదును క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. యాప్‌లో వివరాల నమోదుకు సాంకేతిక సమస్యలు ఉంటే తక్షణమే జిల్లాలోని సచివాలయాల కో-ఆర్డినేటర్‌ను సంప్రదించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, సచివాలయాల జిల్లా కో ఆర్డినేటర్ రాజమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

నిత్య శ్రామికుడు సీఎం చంద్రబాబు

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే పరిటాల సునీత
● వరద ప్రభావిత లంక గ్రామాల్లో పర్యటన.. పంటల పరిశీలన
● ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న సీఎం : మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



వరదకు దెబ్బతిన్న పసుపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీత, ఆలపాటి

కొల్లిపర, సెప్టెంబరు 11 : వరద బాధిత ప్రజలను ఆదుకునేందుకు నిరంతరం శ్రమిస్తున్న సీఎం నారా చంద్రబాబునాయుడు నిత్య శ్రామికుడని మాజీమంత్రి, ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. గుంటూరు, కృష్ణా, బాపట్ల జిల్లాల్లోని వరద ప్రభావిత లంక గ్రామాల్లో పర్యటిస్తున్న ఆమె బుధవారం మండల పరిధిలోని అన్నవరం లంకకు విచ్చేశారు. ఈ సదర్భంగా ఆ ప్రాంతంలోని వరద బాధితులకు వంట సామగ్రి పంపిణీ చేశారు. అలాగే జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీపీ కనపాల మధుసూదన్‌ప్రసాద్‌తో కలిసి వరదలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు ఏయే పంటలు దెబ్బతిన్నాయి, ఎంత మేర నష్టం వచ్చింది అన్న విషయాలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఈ పరిస్థితిలో ఒక వేళ ముఖ్యమంత్రిగా జగన్ ఉండి ఉంటే జల సమాధులు చూడాల్సి వచ్చేదన్నారు. ఆయన చేసిన తప్పిదం వలనే ఇంతటి విపత్తు ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయా ప్రాంతాల్లోని కూటమి ఎమ్మెల్యేలు బాధిత ప్రజలకు అండగా నిలబడ్డారని, రైతులు, ప్రజలు ఎవరూ అధైర్య పడవద్దని కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసానిచ్చారు. ముంపు వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రిగా చంద్రబాబు క్షేత్రస్థాయిలో పని చేయటమే కాకుండా అధికారులను, ప్రజా ప్రతినిధులను సమన్వయపరుస్తూ ప్రజలకు కావాల్సిన మంచినీరు, ఆహారం, నిత్యావసర సరుకులను పంపిణీ చేయించారన్నారు. కూటమి ప్రభుత్వం వరదకు నష్టపోయిన ప్రతి ఒక్కరికి నష్టపరిహారం అందించనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ లంక గ్రామాల్లో రైతుల కష్టాలు చూస్తుంటే కన్నీరు వస్తోందన్నారు. పంటలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయన్నారు. చంద్రబాబునాయుడు బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారన్నారు. వరదముంపు వలన ఈ ప్రాంతం అతలాకుతలమైందన్నారు. లంక గ్రామాల్లో ప్రజల కష్టసుఖాలు చూడటానికి నేరుగా వచ్చిన ఎమ్మెల్యే సునీతకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గుదిబండి గోవర్ధనరెడ్డి, బొల్లు యోగానంద చటర్జీ, పందిపాటి నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హార్వేస్ట్ ఇండియా ఆధ్వర్యంలో దుప్పట్లు, వంటసామగ్రి పంపిణీ

మండల పరిధిలోని అన్నవరంలంక, కొత్తూరులంక గ్రామాల్లో వరద బాధితులకు హార్వేస్ట్ ఇండియా అధినేత కత్తెర సురేష్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా అందజేసిన వంట సామగ్రి, దుప్పట్లను ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడం మానవ ధర్మమన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా మాట్లాడుతూ 40 సంవత్సరాలు నుంచి హార్వేస్ట్ ఇండియా పేద ప్రజలకు అండగా ఉంటోందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుది గోవర్ధనరెడ్డి, యోగానంద చటర్జీ, నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు వంట సామగ్రి, దుప్పట్లు అంద చేస్తున్న ఎమ్మెల్యే సునీత, జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, మాజీ మంత్రి ఆలపాటి



తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతి పత్రం అందిస్తున్న రైతులు

ఆలయ భూమి కాదు.. సొంతభూమే

● తహసీల్దార్‌ను కలిసిన సంగంజాగర్లమూడి రైతులు

తెనాలి రూరల్, సెప్టెంబరు 11: తమ సొంత పొలాలను దేవాదాయశాఖకుచెందిన భూములంటూ 2019లో ఆన్‌లైన్ చేశారని దీంతో తమ భూములను కోల్పోయే పరిస్థితి ఉందని తహసీల్దార్ గోపాలకృష్ణ ఎదుట పలువురు రైతులు ఆవేధన వ్యక్తం చేశారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయానికి సంగంజాగర్లమూడి గ్రామ రైతులు వచ్చి వారికి చెందిన పంటభూములను దేవాదాయశాఖ భూములుగా రెవెన్యూ డిజిటల్ ఆన్‌లైన్ రికార్డులో ఉన్నాయని వాటిని సరిచేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వంశపారంపర్యంగా వచ్చిన తమ పంటపొలాలను 2019లో సంగంజాగర్లమూడి శ్రీ సంగమేశ్వరస్వామి దేవాలయానికి చెందిన భూములని ఆన్‌లైన్ చేసుకున్నారని ఆరోపించారు. తమ వద్ద భూముల యజమానులుగా తమ పేరు మీదడాక్యుమెంట్లు ఉన్నాయన్నారు. తరతరాల నుండి ఆ భూములు తమవేనని దేవాదాయశాఖకు ఎటువంటి సంబంధం లేదన్నారు. భూయజమానులుగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో సహా తహసీల్దార్‌కు అందించామన్నారు. తమ భూములను తిరిగి అప్పగించాలని కోరుతూ వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు పరిశీలించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో బాధిత రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 11: స్టెప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కన్వీనర్ తన్నీరు శివశంకర్ తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో డిగ్రీ, పీజీ విద్యార్థులకు తుళ్లూరు మండలం, నెక్కల్లు గ్రామంలో శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థులలో ఆత్మన్యూనత భావం పోగొట్టి ఆత్మ విశ్వాసం నింపి జీవిత లక్ష్యాన్ని సాధించే దిశగా శిక్షణ ఇస్తారని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9030644440 సెల్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

యాచకుడు మృతి



మృతదేహాన్ని తరలిస్తున్న సేవాసమితీ సభ్యులు

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 11: స్థానిక రామలింగేశ్వర పేటలోని శ్రీసాయి బాబా మందిరం దగ్గర మంగళవారం రాత్రి అనారోగ్య సమస్యలతో యాచకుడు (60) మృతి చెందాడు. సాయిబాబా మందిర కమిటీ సభ్యులు బుధవారంశివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవాసమితీ సభ్యులు కుర్రా శ్రీను, పొడుగు బ్రహ్మంలకు తెలపగా వారు ఆ యాచకుని మృతదేహానికి హిందూ సాంప్రదాయ పద్ధలో అంతిమ సంస్కారాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతి చెందిన వృద్ధుడు గత 30 సంవత్సరములుగా బాబావారి మందిరం వద్ద బిక్షటన చేస్తు జీవిస్తుంటాడని, అనారోగ్య సమస్యలతో మృతి చెందాడని, తనకు ఎవరు లేకపోవడంతో అంతిమ సంస్కారాలు నిర్వహిచామని తెలిపారు. కార్యక్రమంలో భక్తబృందం సేవా సమితీ సభ్యులు పాల్గొన్నారు.

ఏం ప్రజా సేవ చేశారని జైలు ములాఖత్‌లు

● కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్క రవీంద్రనాథ్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు11: బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ ఏం ప్రజా సేవ చేసి జైలుకు వెళ్లారని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ములాఖత్‌కు వెళ్లి పరామర్శించారని కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్క రవీంద్రనాథ్ ప్రశ్నించారు. బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో మాజీ ఎంపీ సురేష్ రిమాండ్‌లో ఉన్నారన్నారు. ములాఖత్ అనంతరం జగన్ మాట్లాడిన తీరు అత్యంత జుగుప్సాకరంగా ఉందన్నారు. జగన్ వ్యవహార శైలి నానాటికి తీసికట్టుగా ఉందన్నారు. రాజకీయాలో హింసకు తావులేదని అంటూనే మరోవైపు హింసను ప్రోత్సహించేలా జగన్ చేస్తున్న వాఖ్యలు ఉన్నాయన్నారు. ఇది రాజకీయాలో సరికాదన్నారు. కేవలం ప్రాంతీయ పార్టీలు ఉండటం వల్లనే ప్రతీకార రాజకీయాలు జరుగుతున్నాయన్నారు. ప్రతీకార రాజకీయాల వల్లన రాష్ట్రాభివృద్ధికి విఘాతం కలుగుతాయని ఆందోళన వ్యక్తం చేసారు. తన ఉనికిని కాపాడుకోవటం కోసం ప్రాంతీయ పార్టీలు అనుసరిస్తున విధానాలతో గత పదేళ్లుగా రాష్ట్రాభివృద్ధి కుంటు పడిందన్నారు. ఇలాగే కొనసాగితే రాబోయే రోజులో దేశంలోనే వెనుకబడిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. రాజకీయాలో వ్యక్తిగత అంశాలను స్వస్తి పలికి రాష్ట్రాభివృద్ధికి ప్రాంతీయ పార్టీలు పాటుపడ్డాలని జక్క రవీంద్రనాథ్ కోరారు.

దేవాలయంలో చోరి

తెనాలి క్రైం, సెప్టెంబర్ 11 : స్థానిక ముత్తెంశెట్టిపాలెం కబేళా వంతెన వద్ద గల అంకమ్మ తల్లి దేవాలయంలో చోరి జరిగింది. బుధవారం ఉదయం భక్తులు దేవాలయంలో హుండీ పగలకొట్టి ఉండటాన్ని గుర్తించారు. హుండీలో షుమారు రూ.70 వేల నుంచి 80 వేల వరకు భక్తులు సమర్పించిన నగదు ఉంటుందని స్థానికులు తెలిపారు. దీనిపై ఒన్‌టౌన్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని, నిఘా పెంచడంతో పాటు రాత్రి వేళ ఈ ప్రాంతంలో గస్తీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



సంస్మరణ సమావేశంలో పాల్గొన్న కళాకారులు

సమాజ సంక్షేమానికే కళాకారుల ప్రదర్శనలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 11 : సమాజం సంక్షేమానికి కళాకారుల ప్రదర్శనలు దోహదపడతాయని ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ చెప్పారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో బుధవారం కళాకారుల సంస్మరణ నిర్వహించారు. ప్రముఖ సినీనటులు రక్తకన్నీరు నాగభూషణం, లక్ష్మీపెరుమాళ్లు, కోడూరు అచ్చయ్య, శిల్పి కుమార్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక ప్రపంచంలో రంగస్థలానికి ప్రాధాన్యత తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కళలను భావి తరాలకు అందించేందుకు ప్రస్తుతతరం దాతల సహకారంతో కృషిని కొనసాగిస్తుందన్నారు. చందు సూర్య భాస్కరరావు, ప్రేమ్‌కుమార్, తన్నీరు శివశంకర్ పాల్గొన్నారు.

టు టౌన్ సీఐగా నజీర్‌బాషా

తెనాలి అర్బన్, సెప్టెంబరు 11 : పట్టణంలోని టు టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా షేక్ మహ్మద్ నజీర్‌బాషాను నియమించారు. గుంటూరు రేంజ్ డీఐజీ వీఆర్‌లో ఉన్న ఆయనను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న సీఐ సుధాకర్ ఓ మహిళ ఫొటో మార్ఫింగ్ కేసులో సస్పెన్షన్‌కు గురయ్యారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు సత్కారం

పెదకాకాని, సెప్టెంబరు 11 : వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో రూ.29 లక్షలు, రూ.23 లక్షల భారీ వార్షిక వేతనాలతో నియామకాలు పొందిన విద్యార్థులు పవిత్ర, శ్రావణిల తల్లిదండ్రులను, అకడమిక్ టాపర్‌గా నిలిచిన వెంకటజ్వాలా తల్లిదండ్రులను వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ఘనంగా సత్కరించారు. బుధవారం కళాశాలలో వీవీఐటీ పూర్వ విద్యార్థులు ప్రుద్విష్, భగదత్‌లను స్మరిస్తూ రెజల్యూషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 2023-2024 విద్యా సంవత్సరంలో నియామకాల క్షీణతను అధిగమించి వివిధ బహుళజాతి సంస్థలలో ఉద్యోగాలు పొందిన 700 విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ మన ప్రియమైనవారిని స్మరిస్తూ మంచి మార్పు కోరుకోవాలని సూచించారు. విద్యార్థులు నియామకాలు పొంది వారి కుటుంబానికి ఆర్థిక చేయూతను అందించడం సంతోషకరమని అన్నారు. అకడమిక్ టాపర్ జ్వాలాతండ్రి ఎస్.మురళి మాట్లాడుతూ వీవీఐటీలో అడ్మిషన్ పొందటమే అదృష్టంగా భావించిన తమకు అకడమిక్ టాపర్‌గా తమ కుమార్తె జ్వాలా నిలబడటం గర్వకారణంగా ఉందన్నారు. అనమలమూడి శ్రావణి తండ్రి చిరంజీవులు మాట్లాడుతూ శ్రావణి విజయం తమకు మంచి పేరు తీసుకువచ్చిందని అన్నారు. మేము కన్న కలలను మా కూతురు నిజం చేసిందని శృంగవరపు పవిత్ర తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తపరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జున రెడ్డి, ప్రుద్విష్ తండ్రి జీవీ రావ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరిస్తున్న వీవీఐటీ యాజమాన్యం



సుందరయ్య కాలనీవాసులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పేదలను ఉదార స్వభావంతో ఆదుకోవాలి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పెదకాకాని, సెప్టెంబర్ 11 : అధిక వర్షాలకు దెబ్బతిన్న పేదలను ప్రతి ఒక్కరు ఉదార స్వభావంతో ఆదుకోవాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పెదకాకాని గ్రామంలో నీట మునిగిన సుందరయ్య కాలనీ, నంబూరు ఎస్టీ కాలనీ ప్రజలకు దుస్తులు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఆపద సమయంలో పేదలను ఆదుకోవడం మానవత్వం అనిపిస్తుంన్నారు. అటువంటి మానవత్వాన్ని ప్రతి ఒక్కరు చాటుకోవాలని సూచించారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పేదలను ఆదుకునేందుకు ఎన్‌కే(నంబూరు కోటేశ్వరరావు) యూత్ ముందుకు రావటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, టీడీపీ గ్రామ అధ్యక్షులు మాకిరెడ్డి జయరాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ డాక్యుమెంట్‌పై ఫిర్యాదు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు11: మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అడిషనల్ ప్రోగ్రామ్ అధికారిగా పనిచేస్తున్న పసుపులేని గణపతి పేరుతో ఫోర్జరీ డాక్యుమెంట్ రూపొందించటంతో ఏపీవో గణపతి బుధవారం ఎంపీడీవో తోపాటు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జికి ఫిర్యాదు చేసారు. ఇటీవల మన్నవ గ్రామ పంచాయతీలో చోరీ జరిగిన సంఘటనపై నమోదైన కేసు విషయంలో ఏపీవో పేరుతో ఫోర్జరీ డాక్యుమెంట్ రూపొందించి కోర్టులో అందచేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచారం హక్కు చట్టం పేరుతో ఏపీవో సర్టిఫికెట్ ఇచ్చినట్లు ఈ ఫోర్జరీ డాక్యుమెంట్‌ను రూపొందించారన్నారు. అయితే మండల పరిషత్ కార్యాలయంలో పౌర సమాచార అధికారిగా ఏవో వ్యవహరిస్తున్నారు. ఏవో మినహా సమాచార హక్కు చట్టం క్రింద సర్టిఫికెట్లు, సమాచారం జారీ చేసే అధికారం ఎవరికీ లేదు. కేవలం కేసు విషయంలో కోర్టును తప్పుదోవ పట్టించే విధంగా ఫోర్జరీ డాక్యుమెంట్ రూపొందించిన వారిపై చట్టబ పరమైన చర్యలు తీసుకోవలసిందిగా ఏపీవో గణపతి ఫిర్యాదులో పేర్కొన్నారు.



వాహనంపై నిమజ్జనానికి తరళివెళ్తుతున్న చింతలపూడి గణనాధుడు

సందడిగా నిమజ్జనాలు

తెనాలిరూరల్, సెప్టెంబరు 11: వినాయక చవితిని పురస్కరించుకుని వివిధ కమిటీలు ఏర్పాటు చేసిన గణనాధుల విగ్రహాల నిమజ్జన కార్యక్రమంతో సందడి వాతావరణం నెలకొంది. పట్టణ, మండల గ్రామాల్లో వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారానికి ఐదురోజులు కావడంతో పలు నిర్వాహక కమిటీలు విగ్రహ నిమజ్జన కార్యక్రమాలను చేపట్టాయి. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై వినాయకస్వామి విగ్రహాల నుంచి తీన్‌మార్, డీజేలతో ఊరేగింపుగా తీసుకువస్తూ సంగంజాగర్లమూడి, కొలకలూరు గ్రామాల వద్ద కొమ్ముమూరు కాలువల బ్రిడ్జిపై నుండి నిమజ్జన కార్యక్రమం పూర్తి చేశారు. పోలీసులు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వేలంలో రూ. 57 వేలు పలికిన లడ్డు

పొన్నూరుటౌన్ : పొన్నూరు పట్టణంలోని తెలగపాలెం రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపంలోని వినాయక లడ్డు రూ. 57 వేలు ధర పలికింది. పట్టణంలోని తెలగపాలెం రామ మందిరం వద్ద చవితి మండపంలో కొలువుతీరిన గణనాధుడు నిమజ్జనం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా గణనాధుడి చేతిలో కొలువుతీరిన లడ్డు వేలం పాట జరగా 30వ వార్డు మాజీ కౌన్సిలర్ యరసాని శ్రీరామమూర్తి స్వామివారి లడ్డును రూ. 57 వేలకు వేలంలో దక్కించుకున్నారు.

మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో వినాయకుడి గుడిలో కొలువుతీరిన గణనాధుడి నిమజ్జనం బుధవారం జరిగింది. చవితి మండపంలో గత ఐదు రోజలుగా ప్రత్యేక పూజలందుకున్న గణనాధుడు ఐదోవ రోజు నిమజ్జనాని తరళివెళ్లాడు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అల్లంకరించిన వాహనంపై గణనాధుడిని ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులు, గ్రామస్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేసారు.



కొల్లిపరలో వినాయకుడి విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కొల్లిపర : మండలంలో గత ఐదు రోజులుగా వినాయకచవితి ఉత్సవాలు కన్నుల పండుగగా నిర్వహిస్తున్నారు. బుధవారం వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, చివలూరు, దావులూరు, చక్రాయపాలెం, అత్తోట తదితర గ్రామాల్లో శ్రీ గణనాథునికి అంగరంగ వైభవంగా భక్తులు పూజలు చేశారు. పండితులు దంపతులు చేత పూజలు చేయించి వినాయకచవితి విశిష్టతను గురించి తెలియజేశారు. మండలంలోని అత్తోట, మున్నంగి, చక్రాయపాలెం, తూములూరు, కొల్లిపర తదితర గ్రామాల్లో కొంత మంది భక్తులు వినాయకుని విగ్రహాలకు పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై విగ్రహాన్ని ఉంచి గ్రామాల్లో కనక తప్పెట్లు, బాణా సంచా కాల్చుతూ గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కృష్ణానదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

'అంబేద్కరిజం' పుస్తకావిష్కరణ



నక్కా ఆనంద్‌బాబుకు పుస్తకాన్ని అందజేస్తున్న కొర్రపాటి సురేషు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 11: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆధునిక భారతావని చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం స్ఫూర్తిదాయకమని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు అన్నారు. దళితఉద్యమకారుడు కొర్రపాటి సురేష్ రచించిన అంబేద్కరిజం (అంబేద్కర్ జన జాగృతి గీతాలు) పుస్తకాన్ని గుంటూరులో బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని అందరికి చేరువచేయాలని అన్నారు. కొర్రపాటి సురేష్ మాట్లాడుతూ తాను రచించిన పుస్తకంలో సమాజంలో ఆధునిక భావజాలంతో పాటు అంబేద్కరిజాన్ని మరోసారి గుర్తుచేస్తుందని వివరించారు. కార్యక్రమంలో యానాది హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు టీ.శంకర్ ప్రసాదు, మాల మహానాడు నాయకులు బీ.మనోజ్, కిరణ్, చిన్నా, మల్లిఖార్జునరావు, చంద్రశేఖర్, ప్రసాదు పాల్గొన్నారు.